# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 4-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:169 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

తీరుగ రోడ్డు ప్రమాద ని
వారణ జేయంగ బూని పాలకులు మహా
జోరుగ"హెల్మెట్ బ్యాంకు"ను
ప్రారంభము చేసినారు పట్నము లోనన్ !!

(రోడ్డు ప్రమాదాల నివారణ కోసం నగర పోలీసులు "హెల్మెట్ బ్యాంకు"ను ప్రారంభించడం చాలా ఉపయోగకరంగా ఉందని ప్రజలు భావిస్తున్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

నాయకుల వ్యక్తిత్వం
నడక ఏది మారకుండా
క్లాసులెన్ని పెట్టుకున్నా
కాగలదా పార్టీకండా
అనువనువు ఒల్లంతా
అవినీతి స్వార్థమే
అవ్వి వదులుకోకుండా
ఆశయాలు వ్యర్థమే



-వేల్పుల నారాయణ
9440433475

# భీకరంగా ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం..
# దాడులతో దద్దరిల్లుతున్న పశ్చిమాసియా




న్యూ ఢిల్లీ, మార్చి 3:ఇరాన్-ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం భీకరంగా సాగుతోంది. ఇజ్రాయెల్, అమెరికా బలగాలు ఇరాన్‌లోని కీలక స్థావరాలపై దాడులు చేస్తుండగా.. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైన, పరిసర దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన విరుచుకుపడుతోంది. నాలుగో రోజైన మంగళవారం పరిస్థితి భీకరంగా మారింది. ఇరాన్ సైన్యం కువైట్‌లోని అమెరికా సైనిక స్థావరంపై దాడికి పాల్పడింది. ఈ దాడిలో అమెరికాకు చెందిన ఆరుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు.

ప్రతిగా అమెరికా, ఇజ్రాయెల్ బలగాలు ఇరాన్‌పై దాడుల మోతమోగిస్తున్నాయి. ఇరాన్ అధ్యక్ష భవనంపైన, ఆ దేశ మిలిటరీ శిక్షణ కేంద్రంపైన, ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యాలయంపైన దాడులకు పాల్పడ్డాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో ఇప్పటివరకు మొత్తం 787 మంది ఇరానీలు మరణించారు. ఇంకా తీవ్రంగా దాడులు కొనసాగుతున్నాయి. దాంతో పశ్చిమాసియాలో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా ఉంది.

## ఇరాన్ దిగి వచ్చింది.. కానీ ఇప్పటికే ఆలస్యమైంది: ట్రంప్

వాషింగ్టన్, మార్చి 03: అమెరికాతో చర్చలకు సిద్ధమంటూ ఇరాన్ దిగి వచ్చింది. అలాంటి వేళ ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దేశానికి చెందిన మిలటరీ నాయకత్వంతోపాటు రక్షణ రంగానికి చెందిన సామర్థ్యాలను నాశనం చేశామన్నారు. ఇదంతా జరిగిన తర్వాత తమతో చర్చలకు సిద్ధమని ఇరాన్ అంటోందని పేర్కొన్నారు. కానీ ఇప్పటికే ఆలస్యమైందనంటూ ట్రంప్ తనదైన శైలిలో వ్యాఖ్యానించారు 'మల్లోజుల'

అమెరికా వద్ద ఆధునిక ఆయుధాలు ఉన్నాయని.. అవి కూడా అపరిమితంగా ఉన్నాయని వివరించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ట్రంప్ వెల్లడించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు రీగన్ లాగా.. అధ్యక్షుడు కూడా నేలపై బూట్లు వేయకుండానే ప్రపంచాన్ని మార్చడానికి ఒక మార్గాన్ని కనుగొన్నారంటూ వైట్ హౌస్ మాజీ స్పీచ్ రైటింగ్ డైరెక్టర్ మార్క్ థిస్సెన్ రాసిన కాలమ్‌కు ప్రతిస్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

అలాగే ఎప్పటికీ విజయవంతంగా యుద్ధం చేస్తూనే ఉండగలమన్నారు. అమెరికా కోసం ఉన్నతశ్రేణి ఆయుధాలను ఇతర దేశాల్లో సైతం నిల్వ చేసినట్లు ట్రంప్ వివరించారు. ఇక యూఎస్ మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌పై విమర్శలు చేశారు. ఆయన ఆయుధాల నిల్వలను సరిగ్గా నిర్వహించలేదంటూ మండిపడ్డారు. రష్యాతో యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్‌కు భారీ ఎత్తున ఆయుధాలు పంపారని ఆరోపించారు. అమెరికా వద్ద నిల్వలు భారీ విజయాలు అందుకునే అంతగా ఉన్నాయని ట్రంప్ ఈ సందర్భంగా వివరించారు.

## ఇరాన్ అధ్యక్ష కార్యాలయంపై దాడి.. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ వెల్లడి

టెహ్రాన్, మార్చి 3: ఇరాన్ రాజధాని నగరం టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేసింది. సోమవారం రాత్రి పక్కా ఇంటెలిజెన్స్ సమాచారంతో టెహ్రాన్ నడిబొడ్డున ఉన్న పలు కీలక ప్రాంగణాలపై దాడులు జరిపామని, అధ్యక్ష కార్యాలయం, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ భవనంపై బాంబులు జారవిడిచామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) తెలిపింది. ఇదే ఏరియాలోని ఇరాన్ మిలటరీ అధికారులకు శిక్షణ ఇచ్చే సంస్థపైన, ఇతర మౌలిక సదుపాయాలపైన కూడా దాడి చేసినట్టు చెప్పింది.



కాగా, తమ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీతో పాటు పలువురు సైనిక ఉన్నతాధికారులను కోల్పోవడంతో ఇరాన్ సైతం ప్రతీకార దాడులు కొనసాగిస్తోంది. ఇజ్రాయెల్‌తో పాటు మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్‌లతో దాడులు చేస్తోంది. రియాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయాన్ని ఇరాన్ డ్రోన్ ఒకటి మంగళవారంనాడు ఢీకొంది. దీంతో మంటలు చెలరేగాయి. అయితే స్వల్పనష్టమే జరిగినట్టు సౌదీ అరేబియా తెలిపింది. కువైట్‌లోని అమెరికా ఎంబసీని కూడా ఇరాన్ డ్రోన్ ఢీకొనడంతో తాత్కాలికంగా ఎంబసీని మూసివేశారు.కాగా, ఇరాన్ దాడులపై ట్రంప్ మంగళవారంనాడు మరోసారి హెచ్చరికలు చేశాయి. సుదీర్ఘమైన దాడులకు తాము సిద్ధమని, తొలుత నాలుగు, ఐదు వారాలు అనుకున్నప్పటికీ అంతకంటే ఎక్కువ రోజులు కొనసాగించే సత్తా కూడా తమకుందని చెప్పారు.

## ఇరాన్‌పై యుద్ధాన్ని బలవంతంగా రుద్దారు.. పాక్ రక్షణ శాఖ మంత్రి ఆగ్రహం

ఇంటర్నెట్ డెస్క్, మార్చి 3: మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలపై పాకిస్థాన్ తొలిసారిగా స్పందించింది. చర్చలకు ఇరాన్ సిద్ధంగా ఉన్నా బలవంతంగా యుద్ధాన్ని రుద్దారని పాక్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ ప్రాబల్యాన్ని పాక్ సరిహద్దుల వరకూ విస్తరించే లక్ష్యంతో రూపొందించిన విస్తృత జియోనిస్టు ఎజెండాలో ఇది భాగమని అన్నారు. ఈ కుట్రను పాక్ అర్థం చేసుకోవాలని అన్నారు.

జియోనిజమ్‌తో (ఇజ్రాయెల్ జాతీయవాదం) మానవాళికి ముప్పు పొంచి ఉందని మంత్రి ఖవాజా ఆసిఫ్ అన్నారు. పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయెల్ దేశాన్ని ఏర్పాటు చేసిన నాటి నుంచీ నేటి వరకూ ఇస్లామిక్ ప్రపంచం ఎదుర్కొన్న ప్రతి యుద్ధం వెనుక జియోనిస్ట్ భావజాలం పాత్ర ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉందని అన్నారు. దాదాపు 100 ఏళ్లుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను జియోనిస్ట భావజాలమే నియంత్రిస్తోందని చెప్పారు. ప్రపంచంలోని శక్తిమంతమైన దేశాలు ఈ సిద్ధాంతానికి బందీలుగా మారాయని వ్యాఖ్యానించారు.

అఫ్గానిస్థాన్, ఇరాన్, భారత ‾లు కేంద్రంగా ఉన్న ఎజెండాకు పాక్ టార్గెట్ అవుతుందని కూడా మంత్రి ఖవాజా ఆసిఫ్ హెచ్చరించారు. అన్ని వైపులా శత్రువులు చుట్టుముడతారని అన్నారు. చివరకు పాక్ ఒక సామంత రాజ్యంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అయితే, పాకిస్థాన్ సైనిక, అణు శక్తిని ప్రపంచమంతా గుర్తించిందని కూడా పాక్ మంత్రి చెప్పారు. పాక్ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు అమరులైన ప్రతి ఒక్కరికీ దేశం రుణపడి ఉంటుందని మంత్రి అన్నారు. పాక్ ఎప్పటికీ శక్తిమంతంగా ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు.

## కలెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



హైదరాబాద్, మార్చి 3: కలెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యక్రమాల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, కార్పొరేటర్లు, మేయర్లు తప్పనిసరిగా భాగస్వాములవ్వాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులకు జిల్లా కేంద్రాల్లో ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా సోలార్ విద్యుత్ వినియోగంపై గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు సీఎం. రైతులకు సోలార్ పంప్ సెట్లు ప్రోత్సాహం అందిస్తామన్నారు.

ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలు గ్రామ, వార్డు సభల్లో ప్రజలకు వెల్లడించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీల సేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సీఎం రేవంత్ ఆదేశించారు. అన్ని సంక్షేమ పథకాలలో ఫేషియల్ రికగ్నిషన్ అమలు చేయాలని.. అనర్హులను తొలగించాలని దిశానిర్దేశం చేశారు. రవాణా శాఖ డేటా పూర్తిగా ఆన్‌లైన్ చేయాలని.. డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. రోడ్ల గుంతల సమాచారం కోసం ప్రత్యేక వాట్సాప్ నంబర్ ఏర్పాటు చేయాలన్న సీఎం.. ఓఆర్ఆర్, సర్వీస్ రోడ్లపై చెత్త డంపింగ్ చేయడంపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

స్కూళ్లలో మధ్యాహ్న భోజన ఏజెన్సీల బిల్లులు ప్రతి నెలా సమయానికి చెల్లించాలన్నారు. నగరాల్లో వర్కింగ్ ఉమెన్స్, బాయ్స్-గర్ల్స్ హాస్టళ్ల నమోదు, పర్యవేక్షణ ఉండాలన్నారు. పాఠశాలలు, కాలేజీల్లో డ్రగ్స్, గంజాయి వినియోగంపై విద్యాసంస్థలు కఠినంగా ఉండాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలో సైకాలజిస్టులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

భూసార పరీక్షలు చేసి రైతులకు సరైన పంటలపై మార్గదర్శనం ఇవ్వాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. యూరియా యాప్ సులభీకరణ, నానో యూరియా ప్రయోజనాలపై క్షేత్ర స్థాయి ప్రదర్శనలు చేపట్టాలన్నారు. వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు సీఎం. జిల్లాల వారీగా పంటల వైవిధ్యంపై కలెక్టర్లు నివేదికలు సమర్పించాలన్నారు.

## స్పోర్ట్స్ బైక్ మోజు.. ఇంటర్ విద్యార్థి మృతి

హైదరాబాద్, మార్చి 3:స్పోర్ట్స్ బైక్‌పై మోజు ఓ ఇంటర్ విద్యార్థి ప్రాణాలు తీసింది. నాగోల్ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇంటర్ పరీక్షలు రాస్తున్న ఇద్దరు స్నేహితుల సరదా బైక్ రైడ్ విషాదంగా ముగిసింది. స్పోర్ట్స్ బైక్‌పై వేగంగా వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. మృతుడు విష్ణువర్ధన్, గాయపడిన విద్యార్థి ఉషాకిరణ్ (16)గా గుర్తించారు.

విద్యార్థులిద్దరూ కొత్తపేటలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. నిన్న(సోమవారం) మ్యాథ్స్ పరీక్ష రాసిన అనంతరం ఎన్జీవోస్ కాలనీ నుంచి కేటీఎం స్పోర్ట్స్ బైక్ ను అద్దెకు తీసుకున్న ఉషాకిరణ్ (16).. దానిపై రైడింగ్ చేయగా, విష్ణువర్ధన్ వెనక కూర్చున్నట్లు తెలుస్తోంది. ఫొటో సెషన్ కోసం శివారులో రైడ్ చేస్తూ అతివేగంతో వెళ్తున్న సమయంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. విష్ణువర్ధన్ తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉషాకిరణ్‌కు కాలు, చేయి విరిగినట్లు తెలుస్తోంది.

నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫత్తుల్లాగూడ 100 ఫీట్ రోడ్డులో ఈ దుర్ఘటన జరిగింది. ఇదే సమయంలో వారి మరో స్నేహితుడు మణిదీప్ ఫోన్ చేయడంతో ప్రమాద విషయం వెలుగులోకి వచ్చింది. నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విష్ణువర్ధన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే గాయపడిన ఉషాకిరణ్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

## విద్యుత్ సంస్థలకు అభినందనలు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, మార్చి 3:18,139 మెగావాట్ల డిమాండ్‌ను తెలంగాణ ప్రభుత్వం నెరవేర్చిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విద్యుత్ డిమాండ్‌ను నమోదు చేసుకుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. వేసవి కాలం నేపథ్యంలో విద్యుత్ వినియోగం గరిష్ఠంగా ఉంటుందని.. అందుకు తగిన అవసరాల కోసం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. తెలంగాణలో రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు.



కోతలు లేకుండా.. ఎటువంటి అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యుత్ సంస్థలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. పెద్ద రాష్ట్రాలతో సమానంగా తెలంగాణ రికార్డు సృష్టించిందని వివరించారు. ఉదయం 8.00 గంటలకే నింగిలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మధ్యాహ్నానికి సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. దీంతో ఇళ్లలోనే ప్రజలు ఉండిపోతున్నారు. ఏసీలు, ఫ్రిజ్‌లు ఆన్ చేసి.. ఉంచుతున్నారు. దాంతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది.

## ఘనంగా వెంటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు..

### -కోలాహలంగా వెంకన్న,అలివేలు మంగమ్మల ప్రతిమల ఊరేగింపు

కరీంనగర్, మార్చి 23హన్మకొండ- కరీంనగర్ ప్రధాన రహదారిలోని హసన్ పర్తి మండల కేంద్రంలో మహిమాన్వితుడు వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం ఉదయం భక్తుల సందడితో కోలాహలంగా నెలకొంది. ఎర్రగట్టు వద్ద కొనసాగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా హసన్ పర్తిలోని ఆలయంలో వెంటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మల ప్రతిమలకు పూజారులు వేదమంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించారు.

అనంతరం కోరినవారికి కోరికలు తీర్చే కొంగుబంగారంగా వరాలనిచ్చే దేవత ప్రతిమలను పెద్ద రథ చక్రం బండిపై ఉంచి, ఊరేగింపును కొనసాగించారు ప్రతి ఏటా మార్చి హె?లీ ఫాల్గుణ పౌర్ణమి రోజున ప్రారంభమై ఐదు రోజుల పాటు కొనసాగుతుంది.అయితే జాతర ఉత్సవ వేడుకలను పురస్కరించుకొని హసన్ పర్తి దేవాలయం నుంచి వెంకన్న, అలివేలు మంగమ్మల ఉత్సవమూర్తుల విగ్రహ ప్రతిమలతో ఊరేగింపుగా గుట్టకు చేరుకోవడంతో జాతర వేడుకలు ప్రారంభమవుతాయి.

కానీ ఈసారి చంద్రగ్రహణం ఉండడం వలన కళ్యాణ మహోత్సవం నిర్వహించడం లేదు. హసన్ పర్తి దేవాలయం నుండి ప్రారంభమైన దేవతా మూర్తుల ప్రతిమల ఊరేగింపు ప్రధాన రహదారిలో కొనసాగడంతో భక్తుల సందడి కొనసాగింది. తండోపతండాలుగా భక్తులు పెద్ద రథం చక్రాల బండికి ఎదురేగి, దేవతా మూర్తులకు కొబ్బరి కాయలు కొట్టి, కానుకలు సమర్పించుకొని మొక్కులు చెల్లించు కున్నారు. ఎర్రగట్టు వెంకన్నా కోటి దండాలంటూ భక్తులు తాళ్ళతో కట్టిన రథాన్ని లాగుతూ ప్రధాన రహదారులలో ఊరేగించారు. అనంతరం ఎర్రగట్టు దేవాలయానికి దేవతా ప్రతిమలను చేర్చారు. గ్రహణ మూలంగా బుదవారం ఉదయం దేవతా ప్రతిమలకు పూజలు నిర్వహించిన అనంతరం ప్రతిష్టించడంతో అట్టహసంగా జాతర ప్రారంభమవుతుంది. ఈబ్రహ్మోత్సవాల ర్యాలీలోస్థానిక కార్పొటర్ గురుమూర్తి శివకుమార్, 66వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ బిగుళ్ళ సురేష్ లతో పాటు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు , పాల్గొన్నారు.

## బాచుపల్లిలోని కాలేజీలో దారుణ ఘటన

హైదరాబాద్ మార్చి2: విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించాల్సిన విద్యాలయాలు వికృత చేష్టలకు వేదికలుగా మారుతున్నాయి. హైదరాబాద్ బాచుపల్లి (ప్రగతినగర్) పరిధిలో ఉన్న ఓ ఇంజినీరింగ్ కళాశాలలో సభ్యసమాజం తలదించుకొనే దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. తోటి విద్యార్థినికి మత్తు చాక్లెట్లు ఇచ్చిన ఓ విద్యార్థి ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా.. నెలల తరబడి బ్లాక్‌మెయిల్ చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అదే కళాశాలలో ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న బాధితురాలికి మెకానికల్ బ్రాంచికి చెందిన ఆశీష్ తనే(21) అనే విద్యార్థి పరిచయమయ్యాడు. ఏడాదిన్నర కాలంగా ప్రేమ పేరుతో ఆమె వెంటపడి నమ్మించాడు. పక్కా ప్లాన్‌తో ఆమెకు గంజాయి కలిపిన చాక్లెట్ ఇచ్చాడు. ఆమె స్పృహ కోల్పోగానే కళాశాల తరగతి గదిలోనే ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు.

## సమర్థవంతమైన నలుగురు బీసీ నేతలకు రాజ్యసభ అవకాశం ఇవ్వాలి

హైదరాబాద్, మార్చి 3: రాజ్యసభ స్థానాలపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమర్థవంతమైన నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం ఇవ్వాలని అడుగుతున్నారని తెలిపారు. రాష్ట్రం నుంచి ఒకరికి ఇస్తారా? లేదా ఇద్దరికి ఇస్తారా అనేది రేపు (బుధవారం) తెలుస్తుందన్నారు.

జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యసభ స్థానం కోసం అడగడం లేదని చెప్పారు. కార్పొరేట్ శక్తులకు బీఆర్ఎస్ రాజ్యసభ అవకాశాలు ఇచ్చిందని విమర్శించారు.

తెలంగాణ కోసం పనిచేసిన వారిలో ఒక్కరికైనా బీఆర్ఎస్ రాజ్యసభ ఛాన్స్ ఇచ్చిందా? అని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. మార్చి నెలలో కొన్ని కార్పొరేషన్ పదవులు ఇస్తామని, ప్రస్తుతం వాటిపై కసరత్తు జరుగుతోందని మహేష్ గౌడ్ తెలిపారు.




విజయ్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమాధానం ఇచ్చారని చెప్పారు. రాజకీయాల కోసమే విజయ్ మాట్లాడుతున్నారని, కేరళంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన వెల్లడించారు.

నమ్ముకున్న సిద్ధాంతం కోసం మావోయిస్టులు దశాబ్దాలుగా పనిచేశారని టీపీసీసీ చీఫ్ చెప్పుకొచ్చారు. ఆపరేషన్ కగార్‌ను తాము వ్యతిరేకించామని తెలిపారు. పాకిస్థాన్‌తో చర్చలకు ఒప్పుకున్న మోదీ మావోయిస్టులతో చర్చలకు ఒప్పుకోలేదని విమర్శించారు. వారి సిద్ధాంతంతో తమకు భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ప్రజల కోసం పోరాడిన వారిపై గౌరవం ఉంటుందని చెప్పారు. తామైనా, మావోయిస్టులయినా పేద ప్రజల కోసమే పోరాటం చేశామని.. లొంగిపోయిన మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఆహ్వానిస్తామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# శ్రామికులకు వృత్తిపరమైన భద్రత, శ్రేయస్సు కల్పన మన కనీస కర్తవ్యం

## (04 మార్చి "జాతీయ భద్రత దినోత్సవం" సందర్భంగా)

మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎస్‌ఎల్‌బిసి సొరంగం పనుల్లో నిమగ్నమై ప్రమాదం జరగడంతో ఎనిమిది మంది విగత జీవులు అయ్యారనే వార్త విని అందరం షాక్‌కు గురి అయ్యాం. భద్రీనాథ్ సమీపాన మంచును తొలగించే పనిలో నిమగ్నమైన 55 మంది సిబ్బంది గ్రేసియర్ విరిగిపడిన ఘటనలో 55 మంది మంచులో చిక్కుకున్నట్లు, అందులో 50 మందిని కాపాడినట్లు, నలుగురు మరణించి ఉంటారని, మరో ఐదుగురి ఆచూకీ దొరకలేదని తెలిసి విచారం వ్యక్తం చేశాం. ఈ విధమైన దుర్ఘటనలు తరుచుగా జరగడం సర్వసాధారణం కావడం సోచనీయం. ఇలా పని ప్రదేశాల్లో లేదా పరిశ్రమల్లో పని చేస్తున్న శ్రామికులు భద్రత కొరవడిన కారణంగా పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురికావడం లేదా ప్రాణాలు సహితం కోల్పోవడం జరుగుతున్నది.

### జాతీయ భద్రత దినోత్సవం-2026 ఇతివృత్తం :

పని ప్రదేశాల్లో ఇలాంటి ప్రాణాపాయ సంఘటనలను నివారించడానికి వృత్తిపరమైన భద్రత అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని భావించి 04 మార్చి 1966న నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పడటానికి గుర్తుగా 1972 నుంచి ప్రతి ఏట "జాతీయ భద్రత దినోత్సవం" లేదా "నేషనల్ సేఫ్టీ డే"ను 04 మార్చిన నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 2026 జాతీయ భద్రత దినోత్సవం ఇతివృత్తంగా "భద్రత పెంపొందించడానికి అవగాహన, సాధికారత కల్పన, భద్రతలో నిమగ్నం చేద్దాం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. వృత్తిపరంగా పని చేసే పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగకుండా, ప్రమాదాలు జరిగినపుడు స్వల్ప నష్టాలు కూడా నమోదు కాకుండా ఉండడానికి కార్మికులకు అవసరమైన భద్రత పట్ల అవగాహన కల్పించడం, భద్రతా చర్యలను పెంచడం, ఉద్యోగులు, పౌర సమాజానికి కనీస అవగాహన కల్పించడమే లక్ష్యంగా జాతీయ భద్రత దినోత్సవం జరుపుకోవడం కొనసాగుతున్నది. జాతీయ భద్రత దినోత్సవంతో పాటు ''జాతీయ భద్రత వారోత్సవాల"(నేషనల్ సేఫ్టీ వీక్)"ను కూడా 04 మార్చి నుంచి 10 మార్చి వరకు నిర్వహిస్తున్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలను సుసాధ్యం చేయడానికి వృత్తిపరమైన భద్రత కనీస అవసరం అని తెలుసుకుందాం.

వృత్తిపరమైన భద్రత చర్యలు, ప్రమాదాల నివారణ జాగ్రత్తలు, సంబంధిత వర్గాలకు అవగాహనతో పాటు అవసర శిక్షణ కార్యక్రమాలను చర్చించడానికి జాతీయ భద్రత దినోత్సవ వేదికలు గత 55 ఏండ్లుగా ఉపయోగపడుతున్నాయి. నేటి డిజిటల్ యుగంలో పని ప్రదేశాలను సురక్షిత కేంద్రాలుగా మార్చడానికి నడుం బిగిద్దాం, స్వల్ప గాయాలు కూడా నమోదు కాని పరిస్థితులను కల్పిద్దాం.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# 128వ ప్రవేశ శిక్షణ కార్యక్రమానికి హాజరైన అధికారులు రాష్ట్రపతితో సమావేశం

న్యూ ఢిల్లీ, మార్చి 3:రాష్ట్ర సివిల్ సర్వీసెస్ నుంచి ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ కి పదోన్నతి పొంది, లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఎల్ బీఎస్ఎన్ఏఏ)లో 128వ ప్రవేశ శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్న అధికారులు నేడు (మార్చి 2, 2026) రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు.

అధికారులను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ.. దేశ నిర్మాణ ప్రక్రియలో సివిల్ సర్వీస్ అధికారుల పాత్ర అత్యంత కీలకమైనదని అన్నారు. అధికారులుగా వారి బాధ్యతలు ఇప్పుడు కేవలం జిల్లా లేదా రాష్ట్ర ప్రాధాన్యతలకు మాత్రమే పరిమితం కాకుండా అంతకు మించి ఉంటాయని పేర్కొన్నారు. శాఖాపరమైన సరిహద్దులకు అతీతంగా ఆలోచించాలని, పాలనలో అడ్డంకులను తొలగించి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సహకారంతో పనిచేయడం ద్వారా సంస్థాగత సమగ్రతను పెంపొందించవచ్చని, ప్రభుత్వ యంత్రాంగాన్ని బలోపేతం చేయవచ్చని తెలిపారు. అభివృద్ధి ఫలితాలను సాధించడంలో, ప్రజా సేవలో అత్యున్నత ప్రమాణాలను పాటించడంలో అధికారుల వృత్తి నైపుణ్యం, సమన్వయం, నిబద్ధత అవసరమని ఆమె చెప్పారు. అధికారులు ఇప్పుడు కేవలం ఒక నిర్దిష్ట ప్రాంతానికి పరిమితమైన పాలకులు కాదని, దేశవ్యాప్తంగా పాటించాల్సిన పాలనా ప్రమాణాలకు వారు సంరక్షకులని ఆమె గుర్తు చేశారు. వారు తీసుకునే ప్రతి నిర్ణయం 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మించాలనే సమగ్ర లక్ష్యానికి అనుగుణంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఐఏఎస్ అధికారులుగా, ప్రజల అవసరాలు, ఆకాంక్షలను నెరవేర్చడానికి విధానాలను సమర్థవంతంగా అమలు చేయాల్సి ఉంటుందని రాష్ట్రపతి పేర్కొన్నారు. అధికారులు తమ విలువైన అనుభవాన్ని 'దేశమే ప్రథమం' అనే స్ఫూర్తిని దిక్సూచిగా చేసుకుని, భవిష్యత్తులో ఎదురయ్యే సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కోవాలని ఆమె సూచించారు.

అధికారులు సమ్మిళిత అభివృద్ధికి దోహదపడతారని ఆశిస్తున్నట్లు రాష్ట్రపతి అన్నారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అత్యంత వెనుకబడిన, నిరుపేద వర్గాలకు చేరినప్పుడే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి అర్థం ఉంటుందని ఆమె చెప్పారు. భౌగోళిక, సామాజిక లేదా ఆర్థిక కారణాల వల్ల ఏ ఒక్క సమూహం కూడా వెనుకబడిపోకుండా చూడటానికి అవిశ్రాంతంగా కృషి చేయాలని అధికారులను కోరారు. స్థిరత్వం, వాతావరణ స్థితిస్థాపకత అధికారుల నిబద్ధతను తెలియజేసే మరో కీలక విషయమని అన్నారు. సీనియర్ అధికారులుగా వారు పర్యావరణహిత పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని, వాతావరణ మార్పులకు అనుగుణంగా ఉండే పాలనను ప్రోత్సహించాలని, స్థిరమైన అభివృద్ధిని నిర్ధారించాలని ఆమె సూచించారు. నేడు మనం తీసుకునే సామూహిక నిర్ణయాలు, చర్యలే భవిష్యత్తు తరాల జీవన ప్రమాణాలను నిర్ణయిస్తాయని ఆమె స్పష్టం చేశారు.

# 'సశక్త నారీ, సమృద్ధ ఢిల్లీ' కార్యక్రమంలో పాల్గొన్న భారత రాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, మార్చి 3:న్యూ ఢిల్లీలో ఇవాళ (2 మార్చి 2026) ఎన్‌సీటీ ఢిల్లీ ప్రభుత్వం నిర్వహించిన 'సశక్త నారీ, సమృద్ధ ఢిల్లీ' కార్యక్రమంలో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ నేడు ప్రతి రంగంలోనూ మహిళలు ప్రతిభను కనబరుస్తున్నారని అన్నారు. "సైనికులుగా దేశ సరిహద్దులను రక్షిస్తున్నారు. శాస్త్రవేత్తలుగా ప్రయోగశాలల్లో పరిశోధనలు చేస్తున్నారు" అన్నారు. క్రీడా పోటీల్లో అంతర్జాతీయ వేదికలపై జాతీయ జెండాను ఎగురవేస్తున్నారని కొనియాడారు. రాజకీయాలు, సామాజిక సేవ, పరిపాలనా విభాగాలు, వ్యాపారాల్లోనూ ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్నారన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న స్నాతకోత్సవాల్లో పట్టాలు, పతకాలు అందుకుంటున్న వారిలో విద్యార్థినుల సంఖ్య పెరగటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. "కానీ హింస, ఆర్థిక అసమానత, సామాజిక మూసధోరణి, ఆరోగ్యం విషయంలో మహిళలు నేటికీ నిర్లక్ష్యానికి గురవుతునేది వాస్తవం. ఈ అడ్డంకులను అధిగమించినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది" అన్నారు. ఒక మహిళ ఎప్పుడైతే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుని, ఆత్మగౌరవంతో జీవించగలదో, సమాన అవకాశాలను, భద్రతను పొందగలదో అప్పుడే నిజమైన సాధికారత సాధించినట్లని తెలిపారు. సాధికారత పొందిన మహిళ కేవలం ఆమె జీవితాన్నే కాక, సమాజ గమనాన్ని, భవిష్యత్ తరాలనూ మార్చగలదని వ్యాఖ్యానించారు.

మహిళా సాధికారతకు భారత ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోందని రాష్ట్రపతి తెలిపారు. "బేటీ బచావో బేటీ పడావో యోజన కార్యక్రమం ద్వారా బాలికల విద్య, భద్రతను ప్రోత్సహిస్తోంది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన ద్వారా కోట్లాది మంది మహిళలు పొగ బారి నుంచి బయటపడి ఆరోగ్యంగా ఉండగలుగుతున్నారు. లక్‌పతి దీదీ యోజన వంటి కార్యక్రమాలు మహిళలకు అవకాశాలు కల్పిస్తూ స్వావలంబన దిశగా నడిపిస్తున్నాయి. మహిళల ఆరోగ్య సంరక్షణలో ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకం కీలక పాత్ర పోషిస్తోంది. ఈ ప్రయత్నాలన్నీ మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిని మెరుగుపరుస్తున్నాయి. మహిళా సాధికారత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని గుర్తుంచుకోవాలి. ఇది సమాజంలోని ప్రతి ఒక్కరి, ప్రతి సంస్థ బాధ్యత. మహిళలను చదివించటం, వారిలో ఆత్మగౌరవాన్ని పెంపొందించటం, ప్రోత్సాహం, మద్దతుని అందించటం మన కర్తవ్యం. మహిళలు కలలను కనవచ్చని, వాటిని నిజం చేసుకోవచ్చని మనం భరోసా కల్పించాలి. వారి కలలను నెరవేర్చుకోవటంలో మనం తోడుంటామని చెప్పాలి" అని రాష్ట్రపతి అన్నారు.

దేశ రాజధాని ఢిల్లీలో అన్ని రాష్ట్రాల, ప్రాంతాల ప్రజలు నివసిస్తారని రాష్ట్రపతి అన్నారు. ఢిల్లీలోని మహిళలు సురక్షితంగా, విద్యావంతులుగా, స్వావలంబన దిశగా సాగినప్పుడు, వారికి ప్రతి రంగంలో ఆత్మవిశ్వాసంతో నాయకత్వాన్ని అందించగలిగితే దేశవ్యాప్తంగా సానుకూల సందేశం వెళ్తుందన్నారు. మహిళా నేతృత్వంలోని అభివృద్ధిలో యావత్ దేశానికి ఢిల్లీ ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.

సమృద్ధ ఢిల్లీ, అభివృద్ధి చెందిన భారతదేశం స్వప్నాన్ని సాకారం చేయటంలో ఢిల్లీ మహిళలకు పూర్తిస్థాయి సహకారం అందించాలంటే, వారు ఎదగటానికి ప్రభుత్వం, సమాజం మెరుగైన వాతావరణాన్ని కల్పించాలని రాష్ట్రపతి అన్నారు. ఎలాంటి ఒత్తిడి, భయం లేకుండా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛా వాతావరణం వారికి ఉండాలని ఆమె కాంక్షించారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం..

## -పోలీసుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం: ఎస్పీ విక్రాంత్ పాటిల్.



అమరావతి, మార్చి 3:మార్చి 8న జరగబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ, పోలీసుల సంక్షేమమే శాఖకు ముఖ్యమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళా పోలీసు సిబ్బంది ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. మహిళా సాధికాంతలో ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తుందని, మహిళలు శారీరకంగా మరియు మానసికంగా దృఢంగా ఉండాలని తెలిపారు.

కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 185 మంది పోలీసు సిబ్బందికి రక్తపోటు, షుగర్, ఈసిజి, టు-డీ ఎకో, పీఎఫ్‌టి, బీఎమ్‌డీ వంటి పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్యంగా మహిళా పోలీసు సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకు న్నారు. వైద్యులు వారికి తగిన సూచనలు, సలహాలు అందించారు. అనంతరం వైద్యుల బృందాన్ని ఎస్పీ అభినందించి, శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ ఎం. మహేష్ కుమార్, ఎఆర్ అదనపు ఎస్పీ కృష్ణమోహన్, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, మహిళా పీఎస్ డీఎస్పీ ఉపేంద్రబాబు, హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, పోలీసు వెల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, మెడికవర్ హాస్పిటల్ వైద్యులు మంజునాథ్, రఘునందిని, సువర్ణ, సింధూర, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసుధన్ రావు, మహిళా పీఎస్ సీఐ రామయ్యానాయుడు, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, ఆర్ఐలు జావేద్, నారాయణ, ఆర్ఎస్ఐలు, మహిళా పోలీసులు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పోలీసు శాఖ పోలీసుల సంక్షేమం కోసం ఇటువంటి ఆరోగ్య కార్యక్రమాల ను నిరంతరం కొనసాగిస్తుందని ఎస్పీ స్పష్టం చేశారు.

# సౌదీ అరేబియా యువరాజు, ప్రధానితో చర్చించిన భారత ప్రధాని

న్యూ ఢిల్లీ, మార్చి 3:గౌరవ సౌదీ యువరాజు, ఆ దేశ ప్రధానమంత్రి మహమ్మద్ బిన్ సల్మాన్‌తో భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చర్చించారు.

పశ్చిమాసియా పరిణామాలపై వారిద్దరూ చర్చించారు. సౌదీ అరేబియాపై ఇటీవలి దాడులను తీవ్రంగా ఖండించిన ప్రధానమంత్రి శ్రీ మోదీ.. అది సార్వభౌమత్వాన్నీ, ప్రాంతీయ సమగ్రతనూ ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు.

వీలైనంత త్వరగా పశ్చిమాసియా ప్రాంతంలో శాంతినీ, స్థిరత్వాన్నీ పునరుద్ధరించడమే ప్రస్తుతం అత్యంత ప్రధానమైన అంశమని వారిద్దరూ అంగీకారానికి వచ్చారు.

ఈ కష్ట కాలంలో సౌదీ అరేబియాలోని భారతీయులకు రక్షణ కల్పిస్తున్న గౌరవ యువరాజుకు భారత ప్రధానమంత్రి శ్రీ మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

"పశ్చిమాసియాలో పరిణామాలపై గౌరవ సౌదీ అరేబియా యువరాజు, ప్రధానమంత్రి మహమ్మద్ బిన్ సల్మాన్‌తో చర్చించాను. ఆ దేశ సార్వభౌమత్వానికీ, ప్రాదేశిక సమగ్రతకూ భంగం కలిగించేలా.. సౌదీ అరేబియాపై ఇటీవల జరిగిన దాడులను భారత్ తీవ్రంగా ఖండిస్తోంది. పశ్చిమాసియా ప్రాంతంలో శాంతినీ, స్థిరత్వాన్నీ పునరుద్ధరించడమే ప్రస్తుతం అత్యంత ప్రధానమైన అంశమన్న ఏకాభిప్రాయానికి వచ్చాం. ఈ కష్టకాలంలో సౌదీ అరేబియాలోని భారతీయులకు రక్షణ కల్పిస్తున్న యువరాజుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను."

# "ఆర్థిక వృద్ధి బలోపేతం.. స్థిరత్వం" ఇతివృత్తంగా నిర్వహించే బడ్జెట్ అనంతర వెబినార్‌లో ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, మార్చి 3:"ఆర్థిక వృద్ధి బలోపేతం.. స్థిరత్వం'' ఇతివృత్తంగా మార్చి 3న నిర్వహించే బడ్జెట్ అనంతర వెబినార్‌లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఉదయం 11:15 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ద్వారా ప్రసంగిస్తారు.

ఈ ఇతివృత్తం కింద (తి) తయారీ, పారిశ్రామిక ఉన్నతీకరణ, వ్యూహాత్మక రంగాలు (తితి) 'ఎంఎస్ఎంఈ'లు, ఆర్థిక- మార్కెట్ సౌలభ్యం (తితితి) నగర ఆర్థిక మండళ్లు (తిల) మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యా లు-సంకు రవాణా తదితర రంగాలను స్పృశిస్తూ ఇలాంటి 4 వేర్వేరు వెబినార్లను నిర్వహిస్తున్నారు.

దేశంలో పారిశ్రామిక స్థాయి విస్తృతి, సాంకేతిక నాయకత్వం మరింత పెంపు, కీలక రంగ పునాదుల బలోపేతం వగైరాల దిశగా భవిష్యద్దార్శనిక సంస్కరణల ప్రోత్సాహాన్ని ఈ బడ్జెట్ అనంతర వెబినార్ ప్రముఖంగా వివరిస్తుంది. ఈ ప్రాధాన్యాలను ప్రభావశీల కార్యాచరణగా మలచడంపైనా ఈ వెబినార్‌లో చర్చాగోష్ఠులు దృష్టి సారిస్తాయి. అలాగే పరిశ్రమ భాగస్వాముల ఆలోచనలు మార్గనిర్దేశం చేస్తాయి. అంతేగాక క్షేత్రస్థాయిలో ప్రణాళికలను ప్రభావవంతంగా అలు చేసేందుకు వారి అనుభవం తోడ్పడుతుంది.

# టీడీపీ నేత రాజేష్ కు కనపర్తి పరామర్శ..!

అమరావతి, మార్చి 3:కోడూరు మండల ఐ టీడీపీ కన్వీనర్, మాజీ తెలుగు యువత అధ్యక్షులు వేములపల్లి రాజేష్ మాతృమూర్తి మాధురి(68) ఇటీవల మృతి చెందారు. మంగళవారం టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు రాజేష్ స్వగృహం వద్ద మాధురి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. రాజేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, టౌన్ పార్టీ అధ్యక్షులు పూత బోయిన శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బొలిశెట్టి విఠల రావు, నీటి సంఘ అధ్యక్షులు అప్పికట్ల రవీంద్ర,పిల్లి మల్లికార్జున రావు, కాగిత ప్రసాద్ , బండే రాఘవ,వేములపల్లి శ్రీ కృష్ణ పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందించిన వేద వ్యాస్..



అమరావతి, మార్చి 3: ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని మాజీ శాసనసభ్యులు బూరగడ్డ వేద వ్యాస్ అన్నారు. పెడన మండలం చేవెంద్ర గ్రామ పంచాయతీముచ్చిలిగుంట గ్రామానికి చెందిన గోరిపర్తి బసవయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా లక్ష 79 వేల రూపాయలు మంజూరయ్యాయి. ఈ చెక్కును లబ్ధిదారునికి వేద వ్యాస్ మంగళవారం అందజేశారు. గ్రామ సర్పంచ్ ఉచ్చుల వీర వెంకటరావు కూడా వున్నారు.

# నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ..

## -గత ప్రభుత్వ నిర్వాకాన్ని కూటమి ప్రభుత్వం సరిచేస్తోంది

## -అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

### -చోడవరంలో 782మంది రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ప్రారంభించిన ఎమ్మెల్యే



అమరావతి, మార్చి 3:గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకాన్ని కూటమి ప్రభుత్వం సరిచేస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం నాగాయలంక మండలం చోడవరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద చోడవరం రెవిన్యూ విలేజ్ పరిధిలోని 782మంది రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా రైతుల భూ హక్కు పత్రాలపై నాటి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి తన ఫోటో వేసుకొని రైతుల్లో అభద్రతాభావం నెలకొల్పారన్నారు.

ఎన్నికల్లో కూటమి ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ద్వారా రాష్ట్రంలోని ప్రతి రైతుకు వారి పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వ రాజముద్రతో అందిస్తోందని తెలిపారు. దీనికి తోడు ఈసారి పాస్ బుక్ జారీ చేసే ముందే, రైతులు వివరాలు సరి చూసుకునే అవకాశం కల్పించి, తప్పులు ఉంటే సరి చూసుకున్న తర్వాతే పాస్ బుక్ ముద్రణ చేయించుకునే అవకాశాన్ని కూటమి ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. తద్వారా కూటమి ప్రభుత్వం పూర్తిగా రైతు పక్షపాత ప్రభుత్వంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సిహెచ్.వీరాంజనేయు ప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్, డీటీ కేశవి, రెవెన్యూ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

# కేప్టివ్, వాణిజ్య ప్రధాన గనుల నుంచి 2026 ఫిబ్రవరిలో నెల వారీ ఉత్పత్తి, సరఫరా

న్యూఢిల్లీ, మార్చి 3:ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో, కేప్టివ్ బొగ్గు గనులతో పాటు వాణిజ్య ప్రధాన బొగ్గు గనుల నుంచి రికార్డు స్థాయిలో 20.49 మిలియన్ టన్నుల (ఎంటీ) మేర ఉత్పత్తి నమోదు అయింది. సరఫరాలు 17.72 ఎంటీ స్థాయికి చేరాయి. బొగ్గు ఉత్పత్తిలో కిందటి సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే చెప్పుకోదగినంతగా.. 18.51 శాతం వృద్ధి ఉంది. ఇది ఈ రంగంలో తవ్వకం కార్యకలాపాలు క్రమ క్రమంగా పెరుగుతుండటాన్ని సూచిస్తోంది.

2025-26 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి వరకూ ఈ గనుల నుంచి మొత్తం బొగ్గు ఉత్పత్తి.. అంతకు పూర్వపు సంవత్సరంలోని ఇదే కాలంతో పోల్చి చూస్తే 11.58 శాతం వృద్ధిని నమోదు చేసింది. కాగా మొత్తం సరఫరాలు ఇదివరకటి సంవత్సరం ఇదే కాలంలో కన్నా 6.78 శాతం మేరకు పెరిగాయి. ఉత్పత్తిలోనూ, వినియోగంలోనూ నిరంతర వృద్ధిని పరిశీలిస్తే కార్యకలాపాల నిర్వహణలో దక్షత, సామర్థ్యాన్ని పెంచే ప్రక్రియ వేగవంతం అవుతూ ఉండడంతో పాటు బొగ్గు తవ్వకం రంగానికి సంబంధించిన వేల్యూ చైన్లో సమన్వయం మెరుగుపడినట్లు తెలుతోంది.

ఈ కథనానికి జతపరిచిన కింది రేఖాచిత్రం నిలకడగా పెరుగుతూ ఉన్న సరళిని ప్రస్ఫుటం చేస్తోంది. ఇది ఉత్పత్తిలోనూ, సరఫరాల్లోనూ క్రమ క్రమంగా మెరుగుదల ఉన్న విషయం స్పష్టం అవుతోంది.

విధానం పరంగా వ్యూహాత్మక చర్యలను తీసుకోవడం, పటిష్ఠ పర్యవేక్షణ, ఆసక్తిదారులకు నిరంతరాయంగా మద్దతును అందిస్తుండటం ఈ రంగం పనితీరును మెరుగుపరిచినట్లు మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ ప్రయత్నాలు నిర్వహణ సంబంధిత ఆమోదాలకు వేగాన్ని సంతరించడంలో, ఉత్పత్తి సామర్థ్యాల్ని పెంపొందింపచేయడంలో కీలక పాత్రను పోషించాయి. దీంతో మొత్తంమీద బొగ్గు ఉత్పత్తితో పాటు సరఫరాల్లో పెరుగుదల చోటుచేసుకొంది.

దేశంలో కేప్టివ్, వాణిజ్య ప్రధాన బొగ్గు గనుల తవ్వకాలకు సంబంధించిన పూర్తి సామర్థ్యాన్ని సద్వినియోగపరుచుకొనేందుకు కట్టుబడి ఉన్నట్లు బొగ్గు మంత్రిత్వ శాఖ పునరుద్ఘాటించింది. రాబోయే కాలంలో ఉత్పత్తి స్థాయిలను నిలకడగా పెంచుతూ, సరఫరాకు సంబంధించిన సమస్యల్ని తగ్గించడంతో పాటు, దేశంలో అంతకంతకూ పెరుగుతున్న ఇంధన అవసరాల్ని తీర్చడంలో ఈ రంగం పోషిస్తున్న కీలక పాత్రను బలోపేతం చేయడంపైన దృష్టిని కేంద్రీకరిస్తామని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# పెంచిన ఎయిర్ బస్ డ్రైవర్ల వేతనాలు

వరంగల్,మార్చి 3: నర్సంపేట హైర్ బస్ డ్రైవర్లకు రెండేళ్ల వేతనాలను పెంచినట్లు అసోసియేషన్ ప్రకటించింది. వేతనాల విషయంలో యజమానులతో డ్రైవర్ల యూనియన్ ప్రతినిధులు చేసుకున్న పూర్వ వేతన ఒప్పందం డిసెంబర్ 2025తో ముగియడంతో, నూతన ఒప్పందం కోసం యూనియన్ నాయకులు, యాజమాన్యాల మధ్య చర్చలు జరిగాయి.

**పెంచిన నూతన వేతనాల ఒప్పందం ప్రకారం:**

పల్లె వెలుగు డ్రైవర్‌కు 15 రోజులకు రూ.18,500 వేతనం.

ఎక్స్‌ప్రెస్ డ్రైవర్‌కు 15 రోజులకు రూ.20,500 వేతనం.

పల్లె వెలుగు టెంపరరీ డ్రైవర్‌కు రోజుకు రూ.1,250.

ఎక్స్‌ప్రెస్ టెంపరరీ డ్రైవర్‌కు రోజుకు రూ.1,400.

దసరా పండుగ సందర్భంగా ఒక సంవత్సరం సీనియారిటీ కలిగిన ప్రతి డ్రైవర్‌కు రూ.2,000 బోనస్ ఇవ్వడానికి అంగీకరించినట్లు తెలిపారు. క్లీనర్‌కు 30 రోజులకు రూ.4,500 వేతనం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ అగ్రిమెంట్ 31 డిసెంబర్ 2028 వరకు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. వేతనాలపై 10 శాతం పెంపు చేయాలని ఒప్పందం కుదిరినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగిశెట్టి ప్రసాద్, తెలంగాణ హైర్ బస్ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు లక్కం ప్రభాకర్, దినేష్, రవీందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, హైర్ బస్ డ్రైవర్ యూనియన్ అధ్యక్షులు నల్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కందికొండ రాజు, ప్రధాన కార్యదర్శి కట్ల ప్రశాంత్, కోశాధికారి ఎరుకల రాజు, సోడ రంజిత్ కుమార్, రంజిత్, ప్రకాష్, శ్రీకాంత్, శ్రావణ్ తదితర డ్రైవర్లు పాల్గొన్నారు.

# నౌకాదళ ఆయుధ విభాగం డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ బీపీ సింగ్

న్యూఢిల్లీ, మార్చి 3:నౌకాదళ ఆయుధ విభాగం డైరెక్టర్ జనరల్ గా (డైరెక్టర్ జనరల్ ఆఫ్ నేవల్ ఆర్మమెంట్ -డీజీఓఎన్ఏ) గా శ్రీ బీపీ సింగ్ 2026 మార్చి 01న న్యూఢిల్లీలోని నౌకాదళ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 1994 బ్యాచ్ ఇండియన్ నేవల్ ఆర్మమెంట్ సర్వీస్ (ఐఎన్ఏఎస్) అధికారి అయిన శ్రీ సింగ్ 2026 ఫిబ్రవరి 28న పదవీ విరమణ చేసిన శ్రీ దివాకర్ జయంత్ స్థానంలో నియమితులయ్యారు.

పాట్నా లోని బీహార్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (ప్రస్తుతం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) నుంచి మెకానికల్ ఇంజనీరింగ్ పట్టా పొందిన శ్రీ బీపీ సింగ్‌కు నౌకాదళ ఆయుధ విభాగంలో మూడు దశాబ్దాలకు పైగా విశేష అనుభవం ఉంది. డీజీఓఎన్ఏగా నియమితులు కావ డానికి ముందు, ఆయన ముంబయిలోని నేవల్ ఆర్మమెంట్ డిపో (ఎన్ఏడీ) చీఫ్ జనరల్ మేనేజర్ గా పనిచేశారు. అక్కడ ఆయన కీలకమైన కార్యకలాపాలు, రవాణా వ్యవస్థ, మౌలిక సదుపాయాల రూపకల్పన వంటి బాధ్యతలను నిర్వహించారు.శ్రీ బి.పి. సింగ్ విశాఖపట్నం, ముంబయి, ట్రోంబే నేవల్ ఆర్మమెంట్ డిపో వంటి కీలక విభాగాల్లో పలు ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించారు. న్యూఢిల్లీలోని నౌకాదళ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ నేవల్ ఆర్మమెంట్ విభాగంలో కూడా ఆయన పనిచేశారు. అక్కడ ఆయుధ రంగంలో విధానాల రూపకల్పన, వ్యూహాత్మక ప్రణాళికలకు తన వంతు సహకారం అందించారు. అలువా ఎన్ఏడీ చీఫ్ జనరల్ మేనేజర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించి, నిర్వహణా సామర్థ్యాన్ని, డిపో నిర్వహణ పద్ధతులను మరింత బలోపేతం చేశారు.

భారత నౌకాదళానికి చెందిన సాధారణ ఆయుధాలు, మందుగుండు సామగ్రి, గైడెడ్ వెపన్ సిస్టమ్స్ నిర్వహణలో శ్రీ సింగ్ కు అపారమైన అనుభవం ఉంది. సంక్లిష్టమైన ఆయుధ వ్యవస్థల కొనుగోలు, నిల్వ, నిర్వహణ, భద్రత, రవాణా వ్యవస్థ, జీవిత కాల మద్దతు (లైఫ్-సైకిల్ సపోర్ట్) వంటి అంశాలలో ఆయనకున్న నైపుణ్యం కార్యకలాపాల సంసిద్ధతను గణనీయంగా మెరుగుపరిచింది.

ప్రఖ్యాత నేషనల్ డిఫెన్స్ కాలేజీ (ఎన్డీసీ - 60) పూర్వ విద్యార్థి అయిన శ్రీ బీపీ సింగ్ వ్యూహాత్మక, జాతీయ భద్రతా అంశాలలో పొందిన ఉన్నత స్థాయి శిక్షణ ఆయన నాయకత్వ పటిమను మరింత పెంచింది.

# అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో రంగ్-ఏ-అరణ్య వేడుకలు

## -అచ్చంపేటలో ఎకాలజికల్ హోలికా దహనం

## -ప్రకృతితో అనుబంధాన్ని చాటిన పర్యావరణ హోలీ వేడుకలు




అచ్చంపేట, మార్చి 3: హోలీ పండుగ, వరల్డ్ వైల్డ్ లైఫ్ డే సందర్భంగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో "రంగ్-ఏ-అరణ్య" పేరిట అచ్చంపేట పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు పాఠశాల విద్యార్థులకు అడవిలో లభించే సహజ వర్ణాల ప్రాముఖ్యతను వివరించారు. పాలపిట్ట నీలి రంగు, పచ్చని వృక్షావరణం, పెద్దపులి నారింజ వర్ణం, అడవి పూల రంగుల సమ్మేళనం వంటి ప్రకృతి సౌందర్యాన్ని ప్రత్యక్షంగా చూపిస్తూ, మన పండుగలు ప్రకృతితో ఎంతగా ముడిపడి ఉన్నాయో వివరించారు.

కార్యక్రమంలో భాగంగా సుమారు 500 మంది విద్యార్థులతో శ్రమదానం నిర్వహించారు. అడవికి హానికరమైన లంటానా కలుపు మొక్కలను తొలగించి, వాటితోనే సంప్రదాయ "హోలికా దహన్" కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిని అధికారులు "ఎకాలజికల్ హోలికా"గా అభివర్ణించారు.

విద్యార్థులకు వివిధ రకాలైన వన్యప్రాణులపై ఎస్సే రైటింగ్ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఇటీవలి కాలంలో అమ్రాబాద్ అరణ్యంలో పులుల దర్శనం పెరిగిందని అధికారులు తెలిపారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉండటం, శ్రీశైలం మార్గంలో ఉండటంతో ఇక్కడ ఎకో టూరిజం కార్యకలాపాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు.

అటవీ సంరక్షణలో చెంచు గిరిజనుల పాత్ర విశేషమని తెలిపారు. తరతరాలుగా అడవిని కాపాడుతూ వచ్చిన చెంచు సమాజానికి జీవనోపాధి అవకాశాలు మెరుగుపడేలా టూరిజం ద్వారా లాభాలు అందించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గతంలో విధులు నిర్వర్తించిన డీఎఫ్‌వో శ్రీ రోహిత్ రెడ్డి హయాంలో పులుల సంరక్షణకు బలమైన పునాది పడిందని అధికారులు గుర్తు చేశారు. ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం, శ్రీశైలం మార్గంలో రాత్రివేళ వాహనాల రాకపోకల నిలుపుదల వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. కోర్ ఏరియాలోని ఐదు గ్రామాలకు అటవీ హక్కుల చట్టం ప్రకారం స్టేజ్-2 అనుమతులు సాధించి పునరావాస చర్యలు చేపట్టడంతో సుమారు 4000 ఎకరాల భూమి పులుల సంరక్షణకు అందుబాటులోకి వచ్చిందన్నారు.

ప్రస్తుతం డీఎఫ్‌వో రేవంత్ చంద్ర ఆధ్వర్యం లో ప్రజలు, కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ నిధుల ద్వారా అటవీ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు.

# ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణకు కట్టుబడి ఉన్నట్లు ప్రధానమంత్రి పునరుద్ఘాటన..

న్యూ ఢిల్లీ, మార్చి 3:ప్రపంచ వన్య ప్రాణి దినోత్సవాన్ని పాటించడం అంటే మన భూగ్రహాన్ని సమృద్ధం చేస్తున్న, మన అనుబంధ విస్తారిత వ్యవస్థలకు పోషణనిస్తున్న వన్యప్రాణుల్లోని అద్భుత వైవిధ్యాన్ని తలుచుకుంటూ పండుగ చేసుకోవడమని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వర్ణించారు. ఈ రోజు వన్యప్రాణుల సంరక్షణ దిశగా పాటుపడుతున్న ప్రతి ఒక్కరి కృషిని గౌరవించడమే కాకుండా సంరక్షణ, మనుగడకు పూచీ పడే పద్ధతుల అనుసరణ, అభయారణ్యాల పరిరక్షణ.. వీటి విషయంలో మనం చూపుతున్న నిబద్ధతను పునరుద్ఘాటించే రోజు అని ఆయన అన్నారు.

ప్రపంచంలో అత్యంత అరుదైన వన్యప్రాణుల్లో కొన్నిటికి నిలయంగా నిలిచే అదృష్టం భారత్ సొంతమని ప్రధాన మంత్రి అన్నారు. ప్రపంచంలో ఉన్న పులుల జనసంఖ్యలో 70 శాతానికి పైగా భారత్‌లోనే ఉన్నాయనీ, దీంతో పాటు ఒక కొమ్ము కలిగిన ఖడ్గమృగాలు ఎక్కడా లేనంత ఎక్కువగా ఇక్కడే ఉన్నాయనీ, ఆసియా ఏనుగులు గరిష్ఠంగా ఉన్నది భారత్‌లోనేననీ ఆయన గుర్తుకు తీసుకు వచ్చారు. గిర్ ఉట్టిపడే ఆసియా సింహాలు ప్రపంచంలో ఒక్క భారత్‌లో మాత్రమే వర్ధిల్లుతున్నాయని కూడా ఆయన తెలిపారు.

వన్యజీవుల సంరక్షణను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అనేక చర్యలను చేపట్టిందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. వాటిలో అత్యుత్తమ అభ్యాసాల్ని ఇతర దేశాలతో పంచుకొనే ఒక అసాధారణ వేదికగా ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్సును ఏర్పాటు చేయడం ఒకటని ఆయన అన్నారు. ఇతర చర్యలలో.. గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ (బట్టమేక పక్షి), ఘడియాల్ (చేపలను తినే మొసలి), స్లాథ్ బియర్ (ఫలాలు, చీమలు, చెదలను ఆహారంగా స్వీకరించే ఒక జాతి ఎలుగుబంటి)ల సంరక్షణకు అమలు చేస్తున్న కార్యక్రమాలతో పాటు చీతాలకు కొత్త ఆవాసాన్ని కల్పించడం వంటివి భాగంగా ఉన్నాయన్నారు.

భారత సాంస్కృతిక సంప్రదాయాల గురించి ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ, ప్రాణులన్నిటి శ్రేయాన్నీ కాంక్షిస్తూ ప్రార్థనలు, వన్యజీవుల్ని సంరక్షించడం, వాటి పట్ల సహనశీల ప్రవర్తనను కలిగి ఉండాలన్న సందేశాలు మన ధర్మగ్రంథాల్లో పేర్కొన్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన

"నిర్వనో వధ్యతే వ్యాఘ్రో నిర్వ్యాఘ్రం ఛిద్యతే వనమ్
తస్మాద్ వ్యాఘ్రో వనం రక్షేద్ వనం వ్యాఘ్రం చ పాలయేత్"

అని చెబుతున్న సంస్కృత సుభాషితాన్ని ప్రజలతో పంచుకున్నారు.

అరణ్యాలు లేకపోతే పులులు అంతరించిపోతాయి. పులులే లేకపోతే అడవులను నరికేస్తారు. ఈ కారణంగా పులులు వనాలనీ, వనాలు పులులనీ సంరక్షించాలి. ఇది ప్రకృతిలోని పరస్పర ప్రగాఢ ఆశ్రితత్వాన్ని సూచిస్తోంది అనే సందేశాన్ని ఈ సుభాషితం మనకు అందిస్తోంది.

సామాజిక మాధ్యమం ఎక్స్'లో శ్రీ మోదీ అనేక సందేశాలను పొందుపరుస్తూ -

"ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం మన భూగ్రహాన్ని సమృద్ధం చేస్తున్న, మన అనుబంధ విస్తారిత వ్యవస్థలకు పోషణనిస్తున్న అద్భుత జంతుజాల వైవిధ్యాన్ని స్మరించుకొంటూ పండుగ చేసుకోవలసిందిగా సూచించే రోజు. ఇది వన్యప్రాణి సంరక్షణ దిశగా పాటుపడుతున్న ప్రతి ఒక్కరి కృషినీ గౌరవించే రోజు. మనం సంరక్షణ, స్థిరత్వ ప్రధాన ప్రయత్నాలు, అభయారణ్యాల నిర్వహణ.. వీటి పట్ల మన నిబద్ధతను పునరుద్ఘాటిద్దాం. దీంతో మన వన్యజీవులు వర్ధిల్లుతూ ఉంటాయి."

"భారతీయులమైన మనం మన దేశంలో ప్రపంచంలోని అత్యంత అసాధారణ వన్యజీవుల్లో కొన్ని మనుగడ సాగిస్తున్నాయన్న వాస్తవాన్ని తెలుసుకొని గర్విద్దాం. ప్రపంచంలోని పులుల సంతతిలో 70 శాతానికి పైగా భారత్‌లోనే ఉన్నాయి. ఒక కొమ్ము కలిగిన ఖడ్గమృగాలు అతి పెద్ద సంఖ్యలో జీవిస్తోంది మన దేశంలోనే. అలాగే ఆసియా ప్రాంతపు ఏనుగులు ఎక్కువగా ఉన్నది కూడా భారత్‌లోనే. గిర్ కల ఆసియా సింహాలు మనగలుగుతున్న ప్రపంచంలోని ఏకైక దేశం భారతదేశం".

"వన్యజీవుల సంరక్షణ కోసం ఎన్డీయే ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. వాటిలో తోటి దేశాలతో అత్యుత్తమ సంప్రదాయాలను పంచుకొనే ఉద్దేశంతో ఒక అసాధారణ వేదికగా 'ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయెన్స్'ను స్థాపించడం ఒకటి. ఇతర ప్రయత్నాల్లో.. గ్రేట్ ఇండియన్ బస్టర్డ్, ఘడియాల్, స్లాథ్ బియర్, చీతాలకు నూతన ఆవాస కల్పన వంటివి భాగంగా ఉన్నాయి" అని పేర్కొన్నారు.

# భక్తిశ్రద్ధలతో రామలింగేశ్వర స్వామి గిరిప్రదక్షిణ

హైదరాబాద్, మార్చి 3: వికారాబాద్ జిల్లా కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వర స్వామి గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీ సంఖ్యలో హాజరై గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయంలో శ్రీ రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సుమారు రెండు కిలోమీటర్ల మేర పాంబండ గిరి చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఓం నమఃశివాయ అనే పంచాక్షరి మంత్రంతో మార్మోగింది ఈ కార్యక్రమంలో పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు, గిరిప్రదక్షిణ నిర్వాహకులు నర్సింహ్మారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# టీటీడీ చైర్మన్ పదవికి బీఆర్ నాయుడు రాజీనామా చేయాలి : రోజా డిమాండ్

అమరావతి, మార్చి 3: ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో టీటీడీ చైర్మన్ పదవికి బీఆర్ నాయుడు వెంటనే రాజీనామా చేయాలని వైసీపీ మాజీ మంత్రి ఆర్‌కె రోజా డిమాండ్ చేశారు. నగరిలో ఆమె మీడియాతో మాట్లాడుతూ టీటీడీ పదవికి నాయుడు అనర్హుడని ఆరోపించారు.

ఆయన హయాంలో ఆవుల మరణాలు, తొక్కిసలాట ఘటనలు జరిగాయని అన్నారు.

దేశంలో ఏ ఆలయ చైర్మన్‌కు సంబంధించిన వీడియోలు ఇలా బయపటడిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. బీఆర్ నాయుడికి మహిళలంటే గౌరవం లేదని వెల్లడించారు. నిజం ఉంటేనే ఇందు అనే మహిళ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేష్‌కు లేఖ ఎందుకు రాస్తుందని అన్నారు.

టీటీడీ చైర్మన్‌పై వచ్చిన వీడియోలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లడ్డూ వివాదంలో సుప్రీం కోర్టు ఆధ్వర్యంలో దర్యాప్తు జరిగినప్పటికీ మళ్లీ ఏకసభ్య కమిషన్ ఏర్పాటు అనవసరమని తెలిపారు.

# రైలు ఢీ కొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి

హైదరాబాద్, మార్చి 3:పట్టాల పక్కన నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..డబిల్‌పూర్-మనోహరాబాద్ రైల్వే స్టేషన్ల మధ్యన మంగళవారం ఉదయం రైల్వే ట్రాక్ పక్కన నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి కుడి చేతి పై అమ్మ అని పచ్చ బొట్టు ఉందని పోలీసులు తెలిపారు. మృతుడి వయసు సుమారు 20-25 సంవత్సరాలు ఉంటాయని పోలీసులు చెప్పారు. మృతుడి సంబంధీకులు ఏవరైనా ఉంటే సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

# ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026.. కీలక అంతర్జాతీయ ప్రకటనలు, పెట్టుబడులకు హామీలు

న్యూ ఢిల్లీ, మార్చి 3:2026 ఫిబ్రవరి 16 నుంచి 21 వరకు జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్- 2026 అంతర్జాతీయ కృత్రిమ మేధ రంగంలో ఒక కీలక మైలురాయి. ఈ సదస్సు విశేష ఆదరణ పొందింది. దాదాపు 6 లక్షల మంది ప్రత్యక్షంగా హాజరవగా.. వర్చువల్‌గా ప్రత్యక్ష ప్రసారం ద్వారా మొత్తం 9 లక్షల మందికి పైగా వీక్షించారు. వందకు పైగా దేశాల ప్రతినిధులు, 20 అంతర్జాతీయ సంస్థలు ఈ సదస్సులో చర్చల్లో పాల్గొన్నాయి.

ఈ సదస్సు సందర్భంగా 'బాధ్యతాయుత ఏఐ వినియోగంపై 24 గంటల్లోనే రికార్డు స్థాయి ప్రతిజ్ఞలు' చేయించి గిన్నిస్ ప్రపంచ రికార్డును భారత్ నెలకొల్పింది. బాధ్యతాయుతమైన ఏఐ వినియోగానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేస్తూ 2.5 లక్షల మందికి పైగా ప్రతిజ్ఞలు చేశారు.

భారత్ సొంత కంప్యూటింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచుకోబోతున్నామంటూ చేసిన ప్రకటన ఈ సదస్సులో అత్యంత కీలకమైనది. ఇండియా ఏఐ మిషన్ కింద ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన 38,000 జీపీయూలకు తోడు.. రాబోయే కొన్ని వారాల్లోనే మరో 20,000 జీపీయూలను అదనంగా జోడించనున్నారు. దీంతో దేశ ఏఐ మౌలిక సదుపాయాలు మరింత బలోపేతమవుతాయి.

అంతర్జాతీయ స్థాయిలో కృత్రిమ మేధ వినియోగం బాధ్యతాయుతంగా, పటిష్టంగా, అందరికీ అందుబాటులో ఉండేలా చూసేందుకు విధివిధానాలను రూపొందించడంపై ఈ సదస్సు ప్రధానంగా దృష్టి సారించింది.

మొత్తం 92 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు ఈ ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ప్రకటనను ఆమోదించాయి. ఈ సదస్సులో భాగంగా ఏడు అంశాలపై పని చేసిన వర్కింగ్ గ్రూపుల కృషిని ఈ ప్రకటన ప్రశంసించింది.

విశ్వసనీయ, అందరికీ ఉపయోగపడేలా ఏఐని అందుబాటులోకి తేవడం లక్ష్యంగా.. పేరెన్నికగన్న 13 అగ్రశ్రేణి అంతర్జాతీయ, భారతీయ అత్యాధునిక ఏఐ మోడళ్ల డెవలపర్లు 'న్యూఢిల్లీ ఫ్రాంటియర్ ఏఐ ఇంపాక్ట్ కమిట్‌మెంట్స్'ను ప్రకటించాయి.

సామాజిక ప్రయోజనం, ఆర్థిక వృద్ధి కోసం కృత్రిమ మేధను విజయవంతంగా అమలు చేసిన విధానాలను ఒకరితో ఒకరు పంచుకునేందుకూ, అన్ని దేశాల్లో వాటి అమలుకూ, వాటిని భారీగా విస్తరించేందుకూ వీలుగా గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ కామన్స్ వేదికను ప్రారంభించారు. 30కి పైగా దేశాలకు చెందిన 80కి పైగా స్ఫూర్తిదాయకమైన ఏఐ విజయగాథలు ఇందులో ఉన్నాయి.

అంతర్జాతీయ కార్మిక సంస్థ భాగస్వామ్యంతో 'న్యాయబద్ధంగా ఏఐ దిశగా పరివర్తన' ప్లేబుక్‌ను విడుదల చేశారు. ఏఐ వల్ల రాబోయే కొత్త అవకాశాలను అందుకునేలా ఉద్యోగులను సంసిద్ధులను చేయడం దీని లక్ష్యం.

పటిష్టమైన, వినూత్నమైన, సమర్థమైన కృత్రిమ మేధ లక్ష్యంగా రూపొందించిన 'స్వచ్ఛంద మార్గదర్శక సూత్రాల'పై 20కి పైగా దేశాలు సంతకాలు చేశాయి.

కృత్రిమ మేధ యుగంలో ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఉద్దేశించిన 'స్వచ్ఛంద మార్గదర్శక సూత్రాల'ను 23 దేశాలు అంగీకరించాయి.

ప్రజాస్వామ్య బద్ధంగా ఏఐ విస్తరణ లక్ష్యంగా రూపొందించిన చార్టర్‌పై 22 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు సంతకాలు చేశాయి.

యునెస్కో, ఫ్రాన్స్ భాగస్వామ్యంతో 'సురక్షిత/ పటిష్ట ఏఐ చాలెంజ్' ప్రారంభం.

పటిష్టమైన ఏఐ మౌలిక సదుపాయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్లేబుక్ విడుదల.

అధికారికంగా ప్రారంభించడానికి ముందే, 22 భాగస్వామ్య దేశాల మద్దతుతో 'ట్రస్టెడ్ ఏఐ కామన్స్' ఏర్పాటును ప్రకటించారు.

ఏఐ నిర్వహణపై విడుదల చేసిన మార్గదర్శక పత్రాలను 22 దేశాలు ఆమోదించాయి.

యునిసెఫ్, 20 దేశాల ఆమోదంతో 'ఏఐ ద్వారా సమ్మిళితత్వ పురోగతి కూటమి' ఏర్పాటును ప్రకటించారు.

ప్రారంభంలోనే 19 భాగస్వామ్య దేశాల మద్దతుతో 'వైజ్ఞానిక సంస్థల కోసం ఏఐ నెట్‌వర్క్'ను ప్రారంభించారు.

ఏఐ ఇంపాక్ట్ ఎక్స్ పో, విజ్ఞానదాయక ఫలితాలు, క్షేత్రస్థాయి విస్తరణ

అంశాలవారీగా 10 విభాగాలలో 850కి పైగా ప్రదర్శనకారులతో నిర్వహించిన ఈ ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో.. ప్రపంచంలో అతిపెద్ద ఏఐ ప్రదర్శనల్లో ఒకటిగా నిలిచింది.

# జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన సంఘటన దారుణం : మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి 3:జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన సంఘటన దారుణమని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. గతంలో ఎప్పుడూ చూడని విధంగా మార్చురీ గదిలో మృతదేహాన్ని కుక్క పీక్కుతినడం వైద్య అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. ఆసుపత్రిలో అడుగడుగునా నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు.

జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ,వంద పడకల ఆసుపత్రిని,నూతనంగా నిర్మించిన మార్చురీ బిల్డింగును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మార్చురీ గదిలో ఫ్రీజర్లు లేవని, మృతదేహాలను స్ట్రెచర్ పై కాకుండా నేలపై పెట్టడం దురదృష్టకరమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులను పట్టించుకోవడం లేదని వెల్లడించారు. కనీస సౌకర్యాలు కల్పించక హాస్పిటళు దీనావస్థకు చేరుకుంటున్నాయని వివరించారు. వసతులు లేవు. మందులు లేవని దుయ్యబట్టారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హాస్పిటళ్లను అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని, కొత్త హాస్పిటల్స్ నిర్మించాం. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించామని వెల్లడించారు. పాత రోజులు తెస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ నిజం చేసిందన్నారు. కొత్త హాస్పిటల్‌లో 2024 జూన్ లోనే మార్చురీ బిల్డింగ్ కంప్లీట్ అయినా వాడుకోలేదని పేర్కొన్నారు.

మార్చురీని ఎందుకు మార్చలేదని, పాత దాంట్లో ఫ్రీజర్,స్ట్రెచర్ ఎక్కడ పోయాయని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాలన గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని, జడ్చర్లలో స్థలాలు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. సీఎం సొంత జిల్లా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఇన్‌ఛార్జ్ గా ఉన్న జిల్లాలో ఇంతటి దుస్థితి నెలకొనడం సిగ్గుచేటని ఆరోపించారు. ప్రజలు సమస్యను వివరిస్తే వారిపైనే ఎదురుదాడి చేస్తున్నారని మండిపడ్డారు.

# వేగంగా అభివృద్ధి చెందుతున్న, ఆవిష్కరణ ఆధారిత భారత విద్యా వ్యవస్థతో చేతులు కలపాలని హెచ్ఈఐలకు విద్యాశాఖ మంత్రి పిలుపు

న్యూ ఢిల్లీ, మార్చి 3:ఇవాళ న్యూఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్‌లో విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహించిన స్టడీ ఇన్ ఇండియా ఎడ్యూ-డిప్లొమాటిక్ కాంక్లేవ్ 2026లో కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ప్రసంగించారు. ఉన్నత విద్యలో అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయటంపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ఈ సదస్సులో 50కి పైగా దేశాల రాయబారులు, హైకమిషనర్లు, దౌత్య కార్యాలయాల ప్రతినిధులు, మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో విద్యాశాఖ మంత్రి ప్రసంగిస్తూ, జాతీయ విద్యా విధానం (ఎన్ ఈపీ)-2020 ద్వారా భారతదేశ విద్యా వ్యవస్థలోని మార్పుల గురించి వివరించారు.

విద్యా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు జరుగుతున్న విశేష కృషిని ప్రస్తావిస్తూ.. నాణ్యత, ఆవిష్కరణలు, అందరికీ అందుబాటులో ఉండే ఖర్చుతో విద్యనందించటంపై భారత్ దృష్టి సారిస్తుందని స్పష్టం చేశారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే నాటికి, 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన భారత్ గా మార్చాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంకల్పించారని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక రంగంలో భారత్ ఆశాకిరణంలా వెలుగొందుతుందని.. నేర్చుకోవటానికి, పరిశోధనలకు, నూతన ఆవిష్కరణలకు, వాటిని అమలు చేసేందుకు మన దేశం అపారమైన అవకాశాలను కల్పిస్తుందని చెప్పారు.

శక్తిమంతమైన విజ్ఞాన వ్యవస్థ, డెమోగ్రాఫిక్ డివిడెండ్, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారతదేశానికి గొప్ప బలమని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. ఎన్ఈఏ-2020, స్టడీ ఇన్ ఇండియా కార్యక్రమం ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, విద్యా సంస్థల కోసం అంతర్జాతీయ మార్గాలను భారత్ విస్తరిస్తుందని తెలిపారు.

కృత్రిమ మేధ, బయోటెక్నాలజీ, సెమీ కండక్టర్ల నుంచి సుస్థిర ఇంధనం వరకు విశ్వసనీయమైన ఆవిష్కరణల భాగస్వామిగా భారత్ అవతరిస్తోందని ఆయన వెల్లడించారు. సహకారం, సామర్థ్యం పెంపు, జ్ఞానాన్ని పంచుకోవటం వంటి కీలక అంశాలతో గ్లోబల్ సౌత్ నమూనాను భారత్ ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు.

అనిశ్చితి, వేగంగా మారుతున్న నేటి ప్రపంచంలో విద్యే సమాజాల మధ్య శాశ్వత వారధి అని ఆయన స్పష్టం చేశారు. భాగస్వామ్య దేశాలతో బలమైన విజ్ఞాన వారధులను నిర్మించాలని భారత్ కోరుకుంటున్నట్లు తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న, ఆవిష్కరణలే లక్ష్యంగా సాగుతున్న, బహుళ విభాగాలతో, అందరికీ అందుబాటులో ఉండే భారత విద్యా వ్యవస్థతో కలిసి పనిచేయాలని వివిధ దేశాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు.

ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ వినీత్ జోషి మాట్లాడుతూ.. ఆరేళ్లుగా భారతదేశ ఉన్నత విద్యా సంస్కరణలకు జాతీయ విద్యా విధానం-2020 స్పష్టమైన దిశానిర్దేశం చేసిందని, ముఖ్యంగా వివిధ విభాగాల్లో విద్యను అభ్యసించటం, వృత్తి నైపుణ్యాలను సాధారణ విద్యా విధానంలో అంతర్భాగం చేయటం, భారతదేశ విద్యను అంతర్జాతీయ స్థాయిలో బలోపేతం చేయటం వంటి అంశాల్లో చెప్పుకోదగిన పురోగతి సాధించామని వివరించారు. సంయుక్త, ద్వంద్వ, ఒకే విధమైన కార్యక్రమాల ద్వారా భారతీయ విద్యాసంస్థలు, అంతర్జాతీయ అనుసంధానాన్ని పెంచుకుంటున్నాయని.. మన దేశంలోని ప్రముఖ విశ్వ విద్యాలయాలు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్నాయన్నారు. భారతదేశంలో విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్ ల ఏర్పాటునకు వీలుగా పారదర్శకమైన, కాలపరిమితితో కూడిన నియంత్రణ వ్యవస్థను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అందుబాటులోకి తెచ్చిందని ఆయన పేర్కొన్నారు. దీనిద్వారా ఆస్ట్రేలియా, ఇటలీ, బ్రిటన్, అమెరికాకు చెందిన అగ్రశ్రేణి విద్యా సంస్థల దరఖాస్తులు కేవలం నెలరోజుల్లోనే పరిష్కారమయ్యాయి. భారత్‌తో పరస్పర ప్రయోజనకరమైన ప్రపంచ విద్యా భాగస్వామ్యాన్ని ఏర్పరచుకోవటానికి స్టడీ ఇన్ ఇండియా కార్యక్రమం బహిరంగ ఆహ్వానంగా అభివర్ణించారు.

# సూరారంలో విషాదం.. ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి

హైదరాబాద్, మార్చి 3:సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వకర్మ కాలనీలో విషాదం చోటు చేసుకుంది. పంతులు చెరువు లో ఈతకు వెళ్లిన ఇద్దరు యువకులుసాగర్ ( 17 ), అభిషేక్ ( 17 ) నీటిలో మునిగి దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను పక్కాగా అమలు చేయాలి

హైదరాబాద్, మార్చి 3: 99 రోజుల 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'ను జీహెచ ఎంసీలో రిజల్ట్ ఓరియెంటెడ్‌గా అమలు చేయాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ప్రత్యేకాధికారి జయేష్ రంజన్ జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. సోమవారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో జయేష్ రంజన్ అధ్యక్షతన మొట్టమొదటి జీహెచ్ఎంసీ కార్పొరేషన్ సమావేశం జరిగింది. గత జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీలో తీర్మానించిన 30 అంశాలపై చర్చించి జీహెచ్ఎంసీ కార్పొరేషన్ కమిటీ ఆమోదం తెలిపింది.

అనంతరం మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ప్రణాళికపై అధికారులకు జయేష్ రంజన్ దిశా నిర్దేశం చేశారు.

14 వారాల పాటు జరగనున్న ఈ కార్యక్రమం ఒకో వారం ఒకో థీమ్‌తో జరగనుందని వివరించారు. పారిశుధ్యంతో మొదటి వారం ప్రారంభమై విద్య, వైద్యం, మహిళా, రైతు, యువత, పర్యావరణం తదితర థీమ్‌లతో జరగనుందన్నారు. మొదటి వారం పారిశుధ్యం పేరుతో జరిగే కార్యక్రమంలో గార్బేజ్ వల్నరబుల్ పాయింట్‌లపై ప్రత్యేక దృష్టి సారించి తొలగించాలన్నారు. ఇష్టారీతిన చెత్తను వేసే వారిపై జరిమానాలు విధించడం, ఈ వేస్ట్ సేకరణ వంటి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ప్రభావంతంగా చేపట్టాలన్నారు. యూత్ వీక్‌లో యువతలో నైపుణ్యాల అభివృద్ధి పెంపొందించే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. యాంటీ డ్రగ్ చైతన్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు.

# 'ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలి'



నల్గొండ, మార్చి 3:రాష్ట్ర సాధన కోసం అవిశ్రాంతంగా పోరాడిన ఉద్యమకారులకు గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సూర్యాపేట జిల్లా నూతన అధ్యక్షుడు గుండెపంగు రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం కోదాడలో ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ఆవిర్భావం కోసం జిల్లాలో ఎంతోమంది ఉద్యమకారులు జైలు జీవితం గడిపారని వారి సంక్షేమం కోసం ఈ ఫోరం కృషి చేస్తుందని తెలిపారు. డాక్టర్ శ్రీనివాసరావు తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించారని కొనియాడారు. ఉద్యమ కాలంలో జిల్లా వ్యాప్తంగా రహదారుల దిగ్బంధం, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. హామీలు నెరవేర్చేంతవరకు రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్ నాయకులు మట్టపల్లి శ్రీనివాస్ గౌడ్, తోటపల్లి నాగరాజు రావు, ఆవుల రామారావు, అంజయ్య, కుడుముల రాంబాబు, యేసు, రవి శంకర్, రాజు పాల్గొన్నారు.

# అక్రమ నిల్వాలపై దాడి..

**-సుమారు 15 టన్నుల బియ్యం స్వాధీనం..**

**-ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ..**

**-ఒక్క బియ్యపు గింజ పక్కదారి పట్టినా సహించేది లేదని హెచ్చరిక**



విజయవాడ, మార్చి 3:సోమవారం అర్ధరాత్రి వరకు పౌర సరఫరాలు, రెవెన్యూ అధికారుల సంయుక్త బృందం జరిపిన విస్తృత తనిఖీల్లో భాగంగా వీరులపాడు మండలం, జయంతి గ్రామంలో ఆకస్మికంగా దాడి నిర్వహించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ తెలిపారు. ఈ దాడిలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కింద లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించినట్లు తెలిపారు. కాజా సత్యనారాయణకు చెందిన గోదాంలో సుమారు15 టన్నుల పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. సీజ్ చేసిన 295 బస్తాల రేషన్ బియ్యాన్ని తదుపరి చర్యలు నిమిత్తం కంచికచర్ల ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు చెప్పారు. అదేవిధంగా స్వాధీనం చేసుకున్న 8 వాహనాలను వీరులపాడు పోలీస్ స్టేషన్‌కు అప్పగించడం జరిగిందన్నారు.

ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోందని.. నివేదికల ప్రకారం సంబంధితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేదల కోసం ఉద్దేశించిన నిత్యావసర సరుకుల అక్రమ మళ్లింపును ఏ పరిస్థితుల్లోనూ సహించబోమని, ఒక్క బియ్యపు గింజా పక్కదారి పట్టడానికి వీల్లేదని స్పష్టం చేశారు. పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా నిరంతర తనిఖీలు చేస్తున్న ట్లు తెలిపారు.

ఈ దాడిలో డీఎస్వో పి.వాణి, ఏఎస్వో వి.శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ లు బి.రామకృష్ణ, సీహెచ్ సుమతి, ఆర్ఐ కె.కిషోర్, స్థానిక వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# భారత్-డెలావేర్ బయోమాన్యుఫ్యాక్చరింగ్ వర్కింగ్ గ్రూప్‌ను ప్రతిపాదించిన డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూ ఢిల్లీ, మార్చి 3:భారత్-అమెరికా సంబంధాల్లో భాగంగా అధునాతన బయో- మాన్యు ఫ్యాక్చరింగ్ (జీవ ఉత్పత్తి) రంగంలో భారత్-డెలావేర్ భాగస్వామ్యాన్ని నిర్మాణాత్మకంగా ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సోమవారం పిలుపునిచ్చారు. పరిశోధన, తయారీ, స్టార్టప్ వ్యవస్థల్లో చర్చలను ఆచరణాత్మక సహకారంగా మార్చేందుకు ఒక చిన్న వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు.

సేవా తీర్థ లో డెలావేర్ గవర్నర్ మాట్ మేయర్ నేతృత్వంలోని అమెరికా ప్రతినిధి బృందంతో భేటీ అయిన సందర్భంగా ఈ ప్రతిపాదన వచ్చింది. ఔషధ రంగం, బయోటెక్నాలజీ, స్వచ్ఛ ఇంధనం, ఆవిష్కరణల ఆధారిత పారిశ్రామిక వృద్ధిలో ద్వైపాక్షిక సహకారంపై ఇరు వర్గాలు దృష్టి సారించాయి.

భారత్-అమెరికా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో శాస్త్ర, సాంకేతిక, బయోటెక్నాలజీ కీలకమని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. బలమైన ఆవిష్కరణ వ్యవస్థలు కలిగిన అమెరికా రాష్ట్రాలతో లోతైన సంబంధాలను ఏర్పరుచుకోవడానికి భారత్ సరైన అవకాశం కోసం ఎదురు చూస్తోందని ఆయన అన్నారు. పరిశోధన, అభివృద్ధి నుంచి భారీ స్థాయి, తక్కువ ఖర్చుతో కూడిన తయారీ వరకు... బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా భారత్ ఎదుగుతోందని తెలిపారు.

ప్రభుత్వం, విద్యాసంస్థలు, పరిశ్రమలు, అంకుర సంస్థలను అనుసంధానించే దేశ సమగ్ర ఆవిష్కరణా వ్యవస్థ గురించి కేంద్రమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. 37 ప్రయోగశాలలు, 7,500 కంటే ఎక్కువ మంది శాస్త్రవేత్తలతో కూడిన శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధనా మండలి (సీఎస్ఐఆర్) దేశంలోని పారిశ్రామిక పరిశోధన, అభివృద్ధి ప్రయత్నాలకు వెన్నెముకగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రీన్ హైడ్రోజన్, క్వాంటం టెక్నాలజీస్ నుంచి బయోసైన్సెస్, బయోఫార్మా వరకు వివిధ జాతీయ కార్యక్రమాల్లో సీఎస్ఐఆర్ పోషిస్తున్న పాత్రను, కీలకమైన ఔషధాల తయారీ ప్రక్రియలో అందిస్తున్న సహకారాన్ని ఆయన గుర్తు చేశారు.

బయో-ఫార్మాస్యూటికల్స్ తయారీలో ఆవిష్కరణల కోసం జాతీయ సంస్థ (ఎన్ఐఐ ఎంబీఎల్)తో సహా డెలావేర్ బయో-సైన్స్ వ్యవస్థను ప్రస్తావిస్తూ.. ఆధునాతన బయో మాన్యుఫ్యాక్చరింగ్, కృత్రిమ మేధ ఆధారిత ప్రక్రియలు, వేగవంతమైన భారీ స్థాయి సాంకేతికతలు, భవిష్యత్తు బయోలాజికల్స్, వ్యాక్సిన్ల తయారీలో సహకారానికి బలమైన అవకాశం ఉందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. తక్కువ ఖర్చుతో కూడిన తయారీలో భారత్ సామర్థ్యం, అమెరికాలోని ప్రధాన మందుల తయారీ కంపెనీలకు డెలావేర్ దగ్గరగా ఉండటం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రపంచ ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా తక్కువ ధరకే లభించే బయోలాజిక్స్, బయోసిమిలర్స్, వ్యాక్సిన్లను కలిసి అభివృద్ధి చేయవచ్చని ఆయన సూచించారు.

సహకారానికి సంబంధించిన నిర్దిష్ట మార్గాలను కూడా కేంద్ర మంత్రి వివరించారు. వాటిలో ఉమ్మడి ఆధునాతన బయో- మాన్యు ఫ్యాక్చరింగ్ ప్లాట్‌ఫామ్‌లు, భారతీయ సంస్థలు, డెలావేర్ పరిశోధనా కేంద్రాలను అనుసంధానించే అనువాద పరిశోధన సంస్థలు, అంకుర సంస్థలు, ఇంక్యుబేషన్ అనుసంధానాలను కేంద్రమంత్రి ప్రతిపాదించారు. అలాగే జీఎంపీ తయారీ విధానాలు, నియంత్రణ శాస్త్ర నాణ్యత ప్రమాణాల వ్యవస్థలలో శ్రామిక శక్తికి ఉమ్మడి శిక్షణ అందించడం వంటి అంశాలను ప్రస్తావించారు. నియంత్రణ శాస్త్రంలో సహకారం, ప్రమాణాల ఏకీకరణ సమన్వయం, కీలకమైన బయో ఫార్మాస్యూటికల్ ముడి పదార్థాల కోసం పటిష్టమైన సరఫరా వ్యవస్థను నిర్మించడం వంటివి మరో ప్రాధాన్యతా రంగంగా గుర్తించారు.

ఈ భేటీ సందర్భంగా డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ నేరుగా వివిధ విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలలో సుమారు 150 ఇంక్యుబేటర్లకు మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు. ప్రైవేటు రంగం, డీప్-టెక్ పెట్టుబడులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం రూ.1 లక్ష కోట్ల పరిశోధన, అభివృద్ధి ఆవిష్కరణల నిధిని ఏర్పాటు చేసిందని తెలిపారు. డెలావేర్ రాష్ట్రంలోని పరిశోధన, తయారీ, స్టార్టప్ వ్యవస్థలతో సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఈ వేదికలను ఉపయోగించుకోవచ్చని అన్నారు.

గవర్నర్ మేయర్ మాట్లాడుతూ.. డెలావేర్ రాష్ట్రానికి సుదీర్ఘమైన శాస్త్ర, పారిశ్రామిక వారసత్వం ఉందని వివరించారు. అక్కడి బయో ఫార్మాస్యూటికల్ తయారీ కేంద్రాన్ని, విస్తరిస్తున్న ఓడరేవు మౌలిక సదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణం గురించి ఆయన ప్రస్తావించారు. ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలు, పారిశ్రామిక వేత్తలతో కూడిన ప్రతినిధి బృందంలోని సభ్యులు స్వచ్ఛ హైడ్రోజన్, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్ ఇంక్యుబేషన్, కార్పొరేట్ సంస్థల నమోదు విధానాలపై చర్చించారు. ఉమ్మడి పరిశోధనలు, అంకుర సంస్థల మార్పిడి, సంస్థాగత భాగస్వామ్యాల వంటి అంశాలను ఆచరణాత్మక కార్యక్రమాలుగా మార్చడానికి ఒక వ్యవస్థీకృత వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని ఇరుపక్షాలు అంగీకరిస్తూ సమావేశాన్ని ముగించారు. భారత్, అమెరికా మధ్య ఉన్న విస్తృత వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఈ భేటీ ఒక రాష్ట్ర స్థాయి ప్రమాణాన్ని అందించింది. భవిష్యత్తు సహకారం కోసం బయోటెక్నాలజీ, అధునాతన తయారీ రంగాలు అత్యంత ప్రాధాన్యత కలిగినవిగా అవతరించాయి.

# అక్రమ ఇసుక తవ్వకాల ప్రచారం అవాస్తవం..

**-అన్నారం బ్యారేజ్ వద్ద ఇసుక తవ్వకాలు జరగలేదు**

**-పరీక్షల నిర్వహణ కోసమే డీసిల్టేషన్ పనులు**

**-ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ బాబు**

వరంగల్, మార్చి 3: జయశంకర్ భూపాలపల్లి జిల్లా అన్నారం బ్యారేజ్ వద్ద అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని మహాదేవపూర్ డివిజన్ -2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ బాబు స్పష్టం చేశారు. ఈ ప్రచారం దుష్ప్రచారమని, ప్రజలు ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఎన్‌డీఎస్ఏ సిఫార్సుల మేరకు సాగునీటి శాఖ ప్రతిష్టాత్మక సంస్థ అయిన సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ , పుణేను సంప్రదించిందని తెలిపారు. ఎన్‌డీఎస్ఏ సూచించిన అన్ని పరీక్షలు, సాంకేతిక పరిశోధనలు నిర్వహించే పూర్తి బాధ్యతను సీడబ్ల్యూ పీఆర్ఎస్‌కు అప్పగించినట్లు చెప్పారు. పరీక్షల ఫలితాల ఆధారంగా బ్యారేజ్ పునరుద్ధరణ చేపట్టాలని నిర్ణయించినట్లు వివరించారు.

సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణులు వివిధ సాంకేతిక పరీక్షలు నిర్వహించాలంటే బ్యారేజ్ ప్రాంతం పూర్తిగా ఇసుక, నీరు లేకుండా స్వచ్ఛంగా ఉండాలని స్పష్టంగా తెలియజేశారని చెప్పారు. ప్రతి సంవత్సరం అన్నారం బ్యారేజ్ తక్షణ అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ ప్రాంతాల్లో భారీగా ఇసుక పేరుకుపోతుండటంతో ముందుగానే డీసిల్టేషన్ ప్రతిపాదన చేసినట్లు తెలిపారు.

ఒప్పందం కుదుర్చుకున్న ఏజెన్సీలు సాగునీటి శాఖ, టీజీఎండీసీ అధికారుల పర్యవేక్షణలోనే బ్యారేజ్ తక్షణ అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ ప్రాంతాలు ఫ్లోర్‌పై ఇసుక తొలగింపు పనులు నిర్వహిస్తున్నాయని చెప్పారు. నిర్మాణంపై అవసరమైన పరీక్షలు చేయాలంటే ఇసుక, నీరు లేకుండా ఉండటం తప్పనిసరి అని వివరించారు.

# విడాకులు ఇవ్వడం లేదని భార్యపై కత్తితో దాడి

హైదరాబాద్, మార్చి 3:మరో యువతితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో పాటు విడాకులు ఇవ్వడం లేదన్న కోపంతో భార్యపై కత్తితో దాడిచేసిన భర్తను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం 14లోని నందినగర్‌లో నివాసం ఉంటున్న వడ్డెమాన్ నిర్మలకు 2009లో వడ్డెమాన్ అడివన్న (45)తో వివాహం జరిగింది. వారికి ముగ్గురు పిల్లలున్నారు. మూడేళ్లుగా ఊర్మిళ అనే మహిళతో అడివన్న వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. తనకు విడాకులు ఇస్తే ఊర్మిళను పెళ్లి చేసుకుంటానంటూ పలుమార్లు భార్య నిర్మలతో గొడవకు దిగడంతో పాటు తీవ్ర పదజాలంతో దూషిస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 18న నిర్మలతో గొడవపడిన అడివన్న అమెపై విచక్షణారహితంగా దాడికి దిగడంతో పాటు కత్తితో దాడి చేశాడు. బాధితురాలు చికిత్స పొంది ఇటీవలే డిశ్చార్జ్ అయింది. పెద్దలు సముదాయించడంతో నిర్మల కేసు పెట్టలేదు. ఇదిలా ఉండగా రెండ్రోజుల క్రితం మరోసారి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన అడివన్న నిర్మలను దూషించడంతో పాటు కడుపులో తన్నాడు. అంతటితో ఆగకుండా మరోసారి కత్తితో బెదిరిస్తూ నిర్మలతో పాటు ఆమె పిల్లలను చంపేస్తానని బెదిరించాడు. విడాకుల కోసం తన భర్త తనపై కత్తితో దాడి చేశాడని, అతడివల్ల తనకు, తనపిల్లలకు ప్రాణహాని ఉందంటూ బాధితురాలు నిర్మల ఇచ్చిన ఫిర్యాదుతో నిందితుడు అడివన్నపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# మార్చురీలో మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు.. నలుగురి సస్పెన్షన్

మహబూబ్‌నగర్, మార్చి 3: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. దీనిపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టడంతో రంగంలోకి దిగిన ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపింది. విచారణ అనంతరం బాధ్యులైన నలుగురిని వైద్యారోగ్య శాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు.

# రాష్ట్ర మద్దతు మిషన్ కింద ప్రకృతి వ్యవసాయంపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహించిన నీతి ఆయోగ్

న్యూ ఢిల్లీ, మార్చి 3:నీతి ఆయోగ్ తన స్టేట్ సపోర్టు మిషన్(రాష్ట్ర మద్దతు మిషన్) కింద ప్రకృతి వ్యవసాయంపై రెండు రోజులపాటు జాతీయ వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా ఉన్న రైతులు, విధాన నిర్ణేతలు, శాస్త్రవేత్తలు, అంకుర సంస్థలు, పౌర సమాజ సంస్థలు పాల్గొన్నాయి.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ మార్గదర్శక పుస్తకాలను ఆవిష్కరించడం ఈ వర్క్‌షాప్ ప్రధానాంశం. హిందీ, ఆంగ్ల భాషల్లో రూపొందించిన ఈ మాన్యువల్స్.. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ప్రాంతీయ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు, వ్యవసాయ విస్తరణాధికారులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి ఆచరణాత్మక సమాచారాన్ని అందించి వారిని సాధికారులను చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

గుజరాత్, మహారాష్ట్ర గవర్నర్ శ్రీ ఆచార్య దేవవ్రత్ ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. స్థిరమైన, రైతు కేంద్రీకృత వ్యవసాయ వ్యవస్థల ప్రాముఖ్యతను వివరించారు. నేల సారాన్ని మెరుగుపరచడంలో, పెట్టుబడి ఖర్చులను తగ్గించడంలో, రైతుల ఆదాయాన్ని పెంచడంలో ప్రకృతి వ్యవసాయం పోషించే కీలక పాత్రను వివరించారు.

ఈ కార్యక్రమంలో జునాగఢ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, డాక్టర్ వైఎస్. పర్మార్ ఉద్యానవన, అటవీ విశ్వవిద్యాలయం, గుజరాత్ ప్రకృతి వ్యవసాయ శాస్త్ర విశ్వవిద్యాలయం వంటి ప్రముఖ విద్య, పరిశోధనా సంస్థలు పాల్గొన్నాయి.

పంజాబ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ, ఒడిశా నుంచి రైతులు, వ్యవసాయ అధికారులు కృషి విజ్ఞాన కేంద్రాల (కేవీకే) శాస్త్రవేత్తలు ఈ చర్చలలో పాల్గొన్నారు, ఇది ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లడంలో దేశవ్యాప్త ఆసక్తిని ప్రతిబింబిస్తుంది.

ఏపీఈడీఏ, నాబార్డ్, సహకార మంత్రిత్వ శాఖ, పశు సంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ, పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, ఏటీఏఆర్ఐలు వంటి కీలక కేంద్ర సంస్థలు, మంత్రిత్వ శాఖల అధికారులు కూడా వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. వీరు వివిధ పథకాల కలయిక, ధ్రువీకరణ, మార్కెట్ అనుసంధానం, సంస్థాగత మద్దతుపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ అంకుర సంస్థలు, పౌర సమాజ సంస్థలు, ఆదర్శ రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కూడా పాల్గొన్నాయి. ఇది దేశంలో ప్రకృతి వ్యవసాయానికి మద్దతుగా అభివృద్ధి చెందుతున్న బలమైన వ్యవస్థను ప్రతిబింబించింది.

మొదటి రోజున మొత్తం 770 మంది ప్రతినిధులు ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించడంలో ఎదురయ్యే సవాళ్లు, ధ్రువీకరణ, మార్కెటింగ్, సంస్థాగత మద్దతుపై రైతులు, క్షేత్రస్థాయి నిపుణులు తమ సందేహాలను, క్షేత్రస్థాయి సమస్యలను బహిరంగంగా చర్చించడానికి ఓ చర్చా వేదికను నిర్వహించారు.

# న్యూఢిల్లీ కె.జీ. మార్గ్ లోని ట్రావెన్కోర్ ప్యాలెస్ లో ఈ నెల13 వరకు ప్రదర్శన

న్యూ ఢిల్లీ, మార్చి 3:గిరిజన కళలు, భాషలు, సంప్రదాయాలు భారత సజీవ నాగరికత వారసత్వమని అనేకసార్లు పేర్కొన్న గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ దేశ రాజధానిలో ట్రైబ్స్ ఆర్ట్ ఫెస్ట్ (టీఏఎఫ్) 2026 ను నిర్వహిస్తోంది.

ట్రావెన్కోర్ ప్యాలెస్‌లో 12 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాన్ని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి శ్రీ జుయల్ ఓరం ఈ రోజు ప్రారంభించారు. గిరిజన తెగల ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు వారి వారసత్వ సంపదను కాపాడటానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

సంగీత నాటక అకాడమి సభ్యులు ఆలపించిన వందేమాతరం గీతంతో ఈ వేడుక ప్రారంభమైంది. భారత వాణిజ్య, పారిశ్రామిక మండలుల సమాఖ్య (ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ – ఎఫ్ఐసీసీఐ), నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ (ఎన్జీఎంఏ) సమన్వయంతో గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ ప్రదర్శన ఏర్పాటు చేసింది. భారత గిరిజన దృశ్య సంస్కృతిని ప్రదర్శించే అత్యంత సమగ్రమైన జాతీయ ప్రదర్శనలలో ఒకటిగా ఈ ఉత్సవం 30కి పైగా గిరిజన కళా సంప్రదాయాలకు ప్రాతినిధ్యం వహించే 75 మందికి పైగా గిరిజన కళాకారులను, 1,000కి పైగా కళాఖండాలను ఒకే చోటికి చేర్చింది.

గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ దుర్గాదాస్ ఉయికే, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి రంజన చోప్రా, అదనపు కార్యదర్శి శ్రీ మనీష్ ఠాకూర్, సంయుక్త కార్యదర్శి శ్రీ అనంత్ ప్రకాష్ పాండే, నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంజీవ్ కిషోర్ గౌతమ్, ఫిక్కీ ఎఫ్ఎల్ఓ అధ్యక్షురాలు, ఆయుర్వేదంట్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సుశ్రీ పూనమ్ శర్మ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అధికారిక టీఏఎఫ్ కేటలాగ్‌ను ఆవిష్కరించారు. ఇందులో ఉత్సవంలోని కళాకారులు, కళా సంప్రదాయాలు, కళాఖండాల గురించిన సమగ్ర సమాచారాన్ని పొందుపరిచారు. ట్రైబ్స్ ఆర్ట్ ఫెస్ట్ 2026 అధికారిక ప్రారంభోత్సవంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా ఈ ఉత్సవం ఉద్దేశం, విస్తృతి, కళాత్మక వైవిధ్యాన్ని ప్రతిబింబించే టీఏఎఫ్ ప్రారంభ వీడియోను కూడా విడుదల చేశారు. సాంస్కృతిక విభాగంలో భాగంగా, మేఘాలయలోని షిల్లాంగ్‌కు చెందిన ఖ్మి క్రియేటివ్ సొసైటీ గిరిజన సంగీత సంప్రదాయాలను అద్భుతంగా ప్రదర్శించింది. గిరిజన లయలు, వాద్యాలను శక్తిమంతమైన దేశభక్తి, సమకాలీన వ్యక్తీకరణలతో మేళవించి వారు ఇచ్చిన ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ జుయల్ ఓరం మాట్లాడుతూ, సాంస్కృతిక పరిరక్షణను సామాజిక, ఆర్థిక అభివృద్ధితో అనుసంధానిస్తూ, గిరిజన సాధికారత కోసం తమ మంత్రిత్వ శాఖ ఒక సమగ్ర విధానాన్ని అనుసరిస్తోందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా బలహీనమైన గిరిజన సమూహాల (పీవీటీజీ) కోసం ప్రధానమంత్రి జన్ మన్, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందరికీ చేరేలా చూసేందుకు డీఏజేజీయూఏ, నాణ్యమైన విద్య కోసం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల విస్తరణ, ట్రైఫెడ్ ద్వారా మార్కెట్ అనుసంధానాలను బలోపేతం చేయడం వంటి ప్రధాన కార్యక్రమాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ట్రైబ్స్ ఆర్ట్ ఫెస్ట్ వంటి వేదికలు కేవలం ప్రతీకాత్మక వేడుకలుగా మాత్రమే మిగిలిపోకుండా, ఒక వ్యవస్థీకృత మార్కెట్ వ్యవస్థను సృష్టిస్తాయని ఆయన చెప్పారు. ఈ వేదికలు కళాకారులను కలెక్టర్లు, గ్యాలరీలు, కార్పొరేట్ సంస్థలు, డిజైన్ ఇన్‌స్టిట్యూట్లు, సాధారణ పౌరులతో అనుసంధానిస్తాయని, తద్వారా సాంస్కృతిక వారసత్వాన్ని స్థిరమైన, గౌరవప్రదమైన జీవనోపాధిగా మారుసాయని ఆయన పేర్కొన్నారు.

కేంద్ర గిరిజన వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ దుర్గాదాస్ ఉయికే మాట్లాడుతూ, గిరిజన తెగలు తమ వారసత్వాన్ని, కళాత్మక నైపుణ్యాన్ని తమదైన శైలిలో ప్రదర్శించుకోవడానికి ఇటువంటి ఉత్సవాలు ఒక ప్రామాణికమైన వేదికను కల్పిస్తాయని అభిప్రాయపడ్డారు. కళాకారులు, వివిధ సంస్థల మధ్య జరిగే ఈ పరస్పర సమన్వయం వారి సాంస్కృతిక ఆత్మవిశ్వాసాన్ని బలపరచడమే కాకుండా, వారి గుర్తింపును కూడా పెంచుతుందని ఆయన పేర్కొన్నారు. గిరిజన సమాజానికి యాజమాన్య హక్కులతో కూడిన గౌరవప్రదమైన జీవనోపాధి అవకాశాలను ఇది సృష్టిస్తుందని ఆయన వివరించారు.

గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి రంజన చోప్రా మాట్లాడుతూ, ట్రైబ్స్ ఆర్ట్ ఫెస్ట్ అనేది గిరిజన కళల ప్రోత్సాహాన్ని సమానత్వం, గౌరవం, స్థిరత్వంతో ముడిపెడుతూ, ప్రభుత్వ విధానాలను ఆచరణలోకి తీసుకువస్తుందని చెప్పారు. భారతదేశంలోని గిరిజన సమూహాలు లోతైన విజ్ఞాన వ్యవస్థలు, పర్యావరణ సంబంధిత పరిజ్ఞానం, తరతరాల నిరంతరతను ప్రతిబింబించే విభిన్నమైన కళా సంప్రదాయాలను కొనసాగిస్తున్నాయని, టీఏఎఫ్ ఈ సంప్రదాయాల జాతీయ గుర్తింపును పెంపొందించడం మాత్రమే కాక, వ్యక్తిగత గుర్తింపు, ఆర్థిక సాధికారతకు అర్థవంతమైన అవకాశాలను సృష్టిస్తుందని ఆమె అన్నారు. .

ట్రైబ్స్ ఆర్ట్ ఫెస్ట్ గిరిజన కళాకారుల శ్రమకు తగిన విలువ లభించేలా ఒక పారదర్శకమైన, సహేతుకమైన మార్కెట్ పరిస్థితులను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కళాఖండాల కొనుగోలుదారులు, గ్యాలరీలు, కార్పొరేట్ భాగస్వాములు, వివిధ సంస్థలు, సాధారణ పౌరులతో నేరుగా అనుసంధానం చేయడం ద్వారా, ఈ ఉత్సవం భారీ స్థాయిలో మార్కెట్ అనుసంధానాలను సులభతరం చేస్తుంది.

ఈ ప్రదర్శనలో వార్లీ (మహారాష్ట్ర), గోండ్ (మధ్యప్రదేశ్), భీల్ (మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్), డోక్రా (పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా), సోహ్రాయ్ (జార్ఖండ్), కోయ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్), కురుంబ (తమిళనాడు), సౌరా (ఒడిశా), బోడో (అస్సాం, ఇతర ఈశాన్య రాష్ట్రాలు), ఒరాన్ (జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్), మందన (రాజస్థాన్, మధ్యప్రదేశ్), గోద్నా (బీహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్), ఈశాన్య రాష్ట్రాల వెదురు కళాఖండాలు వంటి అనేక సంప్రదాయ కళారూపాలు కొలువుదీరాయి. ఇవి మన దేశంలోని ప్రాంతీయ వైవిధ్యాన్ని, ప్రాచీన నాగరికత నిరంతరాయ సంప్రదాయాన్ని చాటిచెబుతున్నాయి.

గిరిజన కళలు సుస్థిరత్వం, సామరస్యానికి ప్రతీకలని, ఆధునిక భారతదేశానికి ఈ విలువలు ఎంతో కీలకమని గుర్తిస్తూ, ఈ ఉత్సవంలో సమకాలీన వ్యక్తీకరణలకు కూడా చోటు కల్పించారు. ఇందులో భాగంగా గిరిజన కళాకారులు, ఆధునిక కళాకారులు కలిసి రూపొందించిన ఉమ్మడి కళాఖండాలను ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా, ఈ ప్రదర్శనలో ఈశాన్య రాష్ట్రాల నుంచి కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషం.

ట్రైబ్స్ ఆర్ట్ ఫెస్ట్ కేవలం ప్రదర్శనకే పరిమితం కాకుండా, గిరిజన కళల పునరుద్ధరణ, స్థిరమైన భవిష్యత్తు, సమకాలీన రంగాల్లో గిరిజన కళల ప్రాముఖ్యత, జీవనోపాధి, మార్కెట్ అనుసంధానం వంటి అంశాలపై ప్యానెల్ చర్చలను కూడా నిర్వహిస్తోంది. ఈ ఉత్సవంలో భాగంగా గిరిజన కళల ద్వారా కథ చెప్పడం, ప్రదర్శనతో కూడిన ప్రసంగాలు, ప్రత్యక్ష కళా ప్రదర్శనలు వంటి విభిన్న వర్క్‌షాప్‌లు కూడా ఏర్పాటు చేశారు. భారతదేశం నలుమూలల నుంచి కళా రంగంలో విద్యనభ్యసిస్తున్న 100 మందికి పైగా గిరిజన విద్యార్థులకు ఈ ఉత్సవంలో ప్రత్యేక శిక్షణ లభిస్తోంది. వీరికి సీనియర్ గిరిజన కళాకారులతో మెంటార్‌షిప్ సెషన్లు, ఎగ్జిబిషన్ సందర్శన, ప్రత్యక్ష సృజనాత్మక ప్రక్రియలను స్వయంగా చూసి నేర్చుకునే అవకాశం కల్పించారు.

టీఏఎఫ్ 2026 లో ఖుమ్ – రూటెడ్ ఇన్ క్రియేటివిటీ ప్రాజెక్ట్ ప్రత్యేక ఆకర్షణగా ఉంది. దీనిని శ్రీమతి జై మదాన్ గిరిజన కళాకారులతో కలిసి రూపొందించారు. త్రిపురలో మాట్లాడే కోక్‌బోరోక్ భాషలో "ఖుమ్" అంటే పువ్వు అని అర్థం. పువ్వు పూయడం, వికసించడం, సంపూర్ణ సృజనాత్మక వ్యక్తీకరణను ఇది సూచిస్తుంది. గిరిజన మహిళా కళాకారులు కలసి రంగు, నమూనా, సంప్రదాయం ద్వారా సజీవ కళాఖండంగా మార్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ నేపథ్యం కలిగిన ఈ కళాఖండం మహిళల సృజనాత్మకత, నాయకత్వం, సాంస్కృతిక స్మృతిని చాటి చెబుతూ, ''మహిళలు సృష్టిస్తే సంస్కృతి వికసిస్తుంది" అనే నినాదాన్ని నిజం చేస్తోంది.

ఈ 12 రోజుల ఉత్సవంలో భాగంగా అనేక ఆసక్తికరమైన అంశాలను పొందుపరిచారు. ఇందులో గిరిజన కళా ప్రదర్శనల సందర్శన , ప్రత్యక్ష చిత్రలేఖన ప్రదర్శనలు, బొమ్మల ప్రదర్శన ద్వారా ప్రసంగాలు, గిరిజన అంశాలపై ప్యానెల్ చర్చలు, నిపుణులైన కళాకారుల ద్వారా విద్యార్థులకు మార్గదర్శకత్వం, ప్రతిరోజూ గిరిజన సంగీత, నృత్య సంప్రదాయాలతో కూడిన సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమం గిరిజన మహిళా కళాకారులలోని నాయకత్వ పటిమ, ఉద్యమశీలతను వెలుగులోకి తీసుకురానుంది. సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన సమ్మిళిత వర్క్‌షాప్‌లు, ముఖ్యంగా ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తుల కోసం నిర్వహించే ప్రత్యేక సెషన్లు ఈ ఉత్సవంలో సమాజ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయి.

గిరిజన కళలు, సంస్కృతికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావాలని మంత్రిత్వ శాఖ భావిస్తోంది. ప్రత్యక్ష మార్కెట్ సదుపాయం ద్వారా గిరిజన కళాకారుల జీవనోపాధి అవకాశాలను బలోపేతం చేయడమే దీని లక్ష్యం. అలాగే, భారతీయ సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలో గిరిజన కళను ఒక గౌరవప్రదమైన, స్థిరమైన పునాదిగా నిలబెట్టాలని మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

ట్రైబ్స్ ఆర్ట్ ఫెస్ట్ 2026 మార్చి 3, 2026 నుంచి ప్రజల సందర్శనార్థం అందుబాటులో ఉంటుంది. ఈ ఉత్సవం 2047 నాటికి వికసిత భారత్ సాధించాలన్న గౌరవ ప్రధానమంత్రి దార్శనికతకు అనుగుణంగా రూపుదిద్దుకుంది. గిరిజన తెగల సమగ్ర అభివృద్ధి, సాంస్కృతిక పరిరక్షణ, స్థిరమైన ఆర్థిక సాధికారత పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతను ఇది పునరుద్ఘాటిస్తుంది.ఈ ఉత్సవంతో అనుసంధానమై గిరిజన కళాకారుల నుంచి నేరుగా కళాఖండాలను కొనుగోలు చేయడం ద్వారా వారిని ఆర్థికంగా ప్రోత్సహించాలని, అలాగే గిరిజన సమాజాల సాంస్కృతిక సమానత్వం, సుసంపన్నతను అభివృద్ధి చేయడంలో తమ వంతు పాత్ర పోషించాలని మంత్రిత్వ శాఖ భాగస్వాములందరినీ కోరుతోంది.

# పెద్ద ఉల్లగల్లు గ్రామంలో భారీ చోరీ

**–శిఖాకొల్లి శంకరరావు గృహంలో 11 సవర్ల బంగారం,1/2 కేజీ వెండిచోరీ**

**–రూ. 20 వేలు నగదు మయం, వేలిముద్రలు పరిశీలిస్తున్న క్లూస్ టీమ్**

**–గృహ యజమానుల వేలిముద్రలు సేకరకణ**

**–చోరీ జరిగిన ఇంటిని పరిశీలించిన ఎస్సై కమలాకర్, క్లూస్ టీం సీఐ రవీంద్రారెడ్డి**

అమరావతి, మార్చి 3: ముండ్లమూరు మండలం పెద్ద ఉల్లగల్లు గ్రామంలోని శిఖాకొల్లి శంకరరావు ఇంటిలో సోమవారం రాత్రి భారీ చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే ఉల్లగల్లు గ్రామానికి చెందిన శిఖాకొల్లి శంకరరావు తమ కుటుంబ సభ్యులతో కలిసి సింగరకొండ లోని పుణ్యక్షేత్రమైన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి తిరుణాలకు వెళ్లి, స్వామి వారిని దర్శించుకుని తిరుణాలను చూసి మంగళవారం ఉదయం ఇంటికి వచ్చారు.

ఇంటికి వచ్చి చూడగానే తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న 11 సవర్ల బంగారం, 1/2 కేజీ వెండి, రూ 20000 వేలు నగదు చోరీ జరిగినట్లు గుర్తించి ముండ్లమూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. శంకరరావు ఫిర్యాదు మేరకు ఎస్సై కె. కమలాకర్, ఏఎస్ఐ వి. వి. హనుమంతరావు, ఒంగోలు క్లూస్ టీం సీఐ కె. రవీంద్రారెడ్డి చోరీ జరిగిన గృహాన్ని పరిశీలించి, శంకరరావు కుటుంబ సభ్యులను చోరీ జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.

అనంతరం వేలిముద్రలు సేకరించి, శంకరరావు కుటుంబ సభ్యుల వేలి ముద్రలను సేకరించారు. ఈ సంఘటనపై విచారణ జరిపి నిందితులను పట్టుకోవడం జరుగుతుందని ఎస్సై తెలిపారు. క్లూస్ టీం అధికారులు సీఐ రవీంద్రారెడ్డి, సునీల్, ఏసుబాబు వేలిముద్రను సేకరించారు.

# జంతు సంరక్షణకు శ్రీకారం

## –ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన పవన్ కల్యాణ్

అమరావతి, మార్చి 3:మానవ–వన్యప్రాణి సంఘర్షణను నివారించడం కోసం కూటమి ప్రభుత్వం హనుమాన్ ప్రాజెక్ట్ కు శ్రీకారం చుట్టింది. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో ప్రాజెక్ట్ హనుమాన్‌ను ప్రారంభించింది. మంగళగిరిలో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ప్రసంగించారు. చిత్తూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎక్కడైతే ఏనుగులు, ఇతర వన్యప్రాణులు గ్రామాల్లోకి ప్రవేశించి ప్రజల ప్రాణాలకు, వ్యవసాయానికి ఇబ్బందులు కలిగించే పరిస్థితులు ఉన్నాయని, అలాంటి చోట్ల వీటిని ఎలా అదుపు చేయాలనే ఆలోచన నుంచే ఇది పుట్టిందే హనుమాన్ ప్రాజెక్ట్ అని పేర్కొన్నారు.

వన్యప్రాణులను సంరక్షిస్తూనే మరోవంక వాటి బారి నుండి ప్రజల ప్రాణాలు, పంటలు, పశువులు, ఆస్తులను పరిరక్షించడమే ఈ హనుమాన్ ప్రాజెక్ట్ ప్రధాన కర్తవ్యమని చెప్పారు. దీనికోసం గ్రామీణ స్థాయంలో పంచాయితీరాజ్, వ్యవసాయ, ఉద్యాన వనాలు, రెవెన్యూ, పోలీస్ శాఖలతో పాటు ఇతర విభాగాతో సమన్వయం చేసుకుంటామని, ఈ ప్రాజెక్ట్ ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారి జీపీఎస్ ట్రాకింగ్ వంటి పూర్తి సాంకేతికతతో కూడిన 100 వాహనాలను ప్రారంభించామని గుర్తుచేశారు. ఇందులో 93 రాపిడ్ రెస్పాన్స్ అండ్ రెస్క్యూ టీమ్ వెహికల్స్, వైల్డ్ లైఫ్ అంబులెన్సు ఏడు ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వన్యప్రాణుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి, నష్టపోయిన పంటలకు ఇచ్చే నష్టపరిహారాన్ని గణనీయంగా పెంచామని, అంతకు ముందు అయిదు లక్షల రూపాయలు ఉంటే తాము వచ్చాకా దీన్ని 10 లక్షలకు పెంచామని గుర్తు చేశారు. గాయపడినవారికి పరిహారం మొత్తాన్ని రెండు లక్షలు నిర్ణయించామని తెలిపారు. పశువులు చనిపోతే మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లిస్తున్నామని అన్నారు.

వన్యజీవి రక్షక్ అనే వాలంటీర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టబోతున్నామని, వీరికి రెస్క్యూ కిట్లు అందిస్తున్నామని చెప్పారు. గ్రామస్థాయిలో పాములు, ఇతర జంతువుల నుండి ఎదురయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా శిక్షణ ఇస్తున్నామని అన్నారు. వాలంటీర్లుగా స్థానిక యువతకు అవకాశాలు ఇస్తామని పవన్ స్పష్టం చేశారు.

# ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక

హైదరాబాద్, మార్చి 3: ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన –ప్రగతి ప్రణాళికను నిర్వహిస్తుంది. అయిదు దశల్లో 99 రోజుల పాటు జరిగే కార్యక్రమానికి నోడల్ శాఖ గా వ్యవహరిస్తున్న ప్రణాళిక శాఖ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది.

ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభల నిర్వహణ ,ఏప్రిల్ 16న మండల స్థాయిలో , మే 2న నియోజకవర్గ స్థాయి , మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమాలు ఉంటాయని ఆ శాఖ వెల్లడించింది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుక నిర్వహించనున్నట్లు తెలిపింది. 10 వివిధ థీమ్‌లతో శాఖల వారీగా 99 రోజుల కార్యక్రమం ఉంటుందని వివరించింది.

మొదటి థీమ్‌లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ , రెండవ థీమ్‌లో ఆరోగ్యం 3లో అరైవ్.. అలైవ్, 4లో సంక్షేమం , 5లో పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట, 6లో రైతు సంక్షేమం.. వ్యవసాయంపై కార్యక్రమాల నిర్వహణ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

7లో విద్య, 8లో యువత.. క్రీడలు, 9లో మహిళలు , 10వ థీమ్‌లో పర్యావరణంపై సమావేశాలు జరుగుతాయని తెలిపారు. మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు , 99 రోజుల్లో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలుంటాయని వివరించింది. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను తయారు చేశామని వెల్లడించింది .

# నెమలి వేణు గోపాల్ స్వామి ఉత్సవాల్లో కేశినేని శివనాథ్ రాధాత్తం

**–గతంలో వేణు గోపాల్ స్వామి ఉత్సవాలు గొప్పగా జరిగేవి**

**–పార్లమెంటు పరిధిలో ఇసుక, మట్టి, భూకబ్జాలు, పంచాయితీలు, ఎంపీ కనుసన్నల్లో**

**–హిందూ ధర్మ గురించి చెప్పే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ జిల్లా ప్రజల కు సమాధానం చెప్పాలీ**

**–టిటిడి లడ్డు విషయంలో భక్తుల మనోభావాలను దెబ్బ తీసిన కూటమి ప్రభుత్వం**

**–మంత్రి నారా లోకేశ్ ఆశీస్సుల తో ఎంపీ చిన్ని అరాచకాలు**

**–ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్ డిమాండ్**




విజయవాడ మార్చి 3: విజయవాడ పార్లమెంటు పరిధి లోని తిరువూరు నియోజకవర్గంలో నెమలి శ్రీ వేణుగోపాల స్వామి ఉత్సవాలు గత కొన్ని సంవత్సరాలుగా ఎంతో ఘనంగా నిర్వహిస్తువస్తున్నారు. నెమలి ఉత్సవాలలో విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ వ్యవహరించిన తీరు చాలా బాధాకరం,అటువంటి కార్యక్రమాన్ని ఎంపీ కేసినేని చిన్ని భక్తుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా వ్యవరించారని ఇలాంటి పార్లమెంట్ సభ్యులు ఉండటం ఎన్టీఆర్ జిల్లా ప్రజల కర్మ, దౌర్భాగ్యం అని ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్ అన్నారు.

ఢిల్లీ స్థాయిలో గతంలో ఎంతో గొప్ప వ్యక్తులు మన విజయవాడకు ఎంపీలుగా చేశారు. విజయవాడకు కీర్తి ప్రతిష్టలు తెచ్చారు. కానీ కేశినేని చిన్ని విజయవాడ పార్లమెంటు పరిధి లో అన్ని అవినీతి అక్రమాలు,ఇసుక,మట్టి,దేవుడు భూములు కబ్జా,పంచాయతీలు, చేస్తున్నారని ఒక విధి,రౌడీ, గుండగిరి లాంటి పనులు ఎంపీ చేస్తున్నాడనీ ఆయన ఆరోపణలు చేశారు. ఎంపీకి ఉండాల్సిన హుందాతనం చిన్నికి లేదు, వేణుగోపాల స్వామి పట్టు వస్త్రాలు సమర్పణలో పెద్ద రాదతం చేసి ఉత్సవాలను నాశనం చేస్తున్నారని అన్నారు.

తిరువూరు చెందిన ఎస్.సి ఎమ్మెల్యే విధులకు అడ్డు తగులుతూ,ఆయన హక్కులను హరిస్తూ ,దేవుడి కార్యక్రమం లో జ్యోక్యం చేసుకొని ఎంపి కేశినేని శివనాథ్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని వేణు గోపాల స్వామి కళ్యాణం గొప్పతనన్నీ బ్రస్టు పట్టించారనీ, జిల్లా పరువు పోయేలా ఆయన వ్యవహరించాడనీ అవినాష్ తన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గం లో అతనిపై రుబాబు చేస్తున్నాడు. అతనికి అధికారులు సహకరించకుండా ఎంపీ వ్యవహరిస్తునట్లు వివరించారు.

హిందూ ధర్మాన్ని కాపాడుతున్నాం అని చెప్పే చంద్రబాబు,పవన్ కళ్యాణ్ లు ఇప్పుడు సమాధానం చెప్పాలి, దసరా మహోత్సవాల సమయంలో విజయవాడ ఉత్సవాల పేరుతో ఎంపీ అడ్డంగా దోచుకొని అమ్మవారి ఉత్సవాలు పేరు తో వ్యాపారం చేసి కోట్ల రూపాయలు చిన్ని దోచుకున్నాడు. జగన్ ఐదేళ్ల పాలనలో ఇలాంటి ఘటన జరగలేదు అన్ని వర్గాలకు జగన్ ప్రాధాన్యత ఇచ్చారు. ఈ రెండు సవంత్సరల కాలం లో దేవుడి కార్యక్రమం లలో భక్తుల తొక్కిసలాట, ప్రాణాలు కోల్పోవటం, తప్ప మంచి జరిగినది ఏమిలేదు.

ప్రభుత్వం చేసిన తప్పుడు పనులు నిలదీస్తే వారిపై అసత్య ప్రచారాలు చేయటం కూటమి నేతలు కి అలవాటు గా మారింది. టీటీడీ లడ్డు విషయంలో ప్రభుత్వం పరువు మొత్తం పోయింది. దేవుడు ఆశీస్సులు తమ పై ఉన్నాయి వాస్తవం ఏమిటో అందరికీ తెలిసింది, రాబోయే రోజుల్లో ప్రజలు కూటమి ప్రభుత్వం తగిన బుద్ధి చెబుతారని తిరువూరులో ఎంపీ వలన ఏ పనులు జరగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

నారా లోకేష్ వెనక ఉన్నడాన్న ధైర్యంతో చిన్ని విజయవాడ పార్లమెంటు పరిధిలో అరాచకాలు చేస్తూ, వ్యవహరిస్తున్నాడు. ఇప్పటికైనా తిరువూరు ప్రజలందరికీ ఎంపీ కేశినేని చిన్ని బహిరంగ క్షమాపణ చెప్పాలనీ ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# ఆగివున్న కంటైనర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. 10 మందికి గాయాలు

వరంగల్, మార్చి 3:యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ సమీపంలో ఘోర ప్రమాదం జరిగింది. ఆగివున్న కంటైనర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం ధ్వంసమవ్వగా.. 10 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

వివరాల్లోకి వెళ్తే.. సోమవారం ఉదయం చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం సమీపంలో జాతీయ రహదారిపై ఆగివున్న కంటైనర్‌ను ఏపీకి చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఆర్టీసీ బస్సు నిడదవోలు నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 10 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

బస్సు ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం.

# ఏపీలో దారుణం.. అడవిలో వివాహిత, యువకుడు ఆత్మహత్య

అమరావతి, మార్చి 3:ఏపీలోని నెల్లూరు జిల్లా లో దారుణం జరిగింది. రాపూరు ఘాట్‌రోడ్డు వద్ద అడవిలో వివాహిత, యువకుడు పురుగుల మందు తాగి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ప్రసన్నకుమార్(25), వివాహిత(24) గా గుర్తించారు.

స్థానికుల సమాచారం మేరకు సోషల్ మీడియా ద్వారా పరిచయమైన ఇద్దరు ప్రేమించుకున్నారని, కలిసి జీవించే అవకాశం లేదని ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు.

# బురదలో మోకాళ్లపై కూర్చొని.. రోడ్డు కోసం విద్యార్థుల వేడుకోలు

అమరావతి, మార్చి 3:ఆ గ్రామానికి రోడ్డు లేదు.. దీంతో ఊరిలో నుంచి రాకపోకలు కొనసాగించేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుంది. రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు.. తమ సమస్యను పట్టించుకోవాలని గ్రామానికి రోడ్డు వేయాలంటూ అధికారులకు చాలా సార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు.

చేసేదేమి లేక విద్యార్థులు బురద రోడ్డులో మోకాళ్లపై మోకరిల్లి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ ఘటన కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గం, చాపాడు మండలంలో చోటుచేసుకుంది. మండలపరిధిలోని ఎన్. ఓబాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న తిప్పిరెడ్డిపల్లె గ్రామానికి రోడ్డు వేయాలంటూ చాలా కాలంగా ప్రజలు, విద్యార్థులు అధికారులను కోరుతున్నారు.

# ముగ్గురి ఆత్మహత్య కేసులో నలుగురు అక్రమ వడ్డీ వ్యాపారుల అరెస్టు

హైదరాబాద్, మార్చి 3: అంబర్‌పేటలోని ఒకే ఇంట్లో ముగ్గురు ఆత్మహ త్యకు కారకులైన నలుగురు అక్రమ వడ్డీ వ్యాపారులను అంబర్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను డీసీపీ రక్షిత కే.మూర్తి వెల్లడించారు. ఫిబ్రవరి 24న అంబర్‌పేటలో నివాసముండే హోటల్ వ్యాపారి కడ్డేకర్ రాంరాజ్(54), అతని భార్య మాధవి, కుమారుడు శశాంక్ రాజ్ ముగ్గురు ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. అయిఏ రాంరాజ్ మల్లాపూర్‌లో కింగ్స్ బిర్యాని హోటల్‌ను నడిపిస్తుండేవాడు. హోటల్ నిర్వాహణ నిమిత్తం జవహర్‌నగర్, మౌలాలికి చెందిన రియల్ ఎస్టేట్, స్క్రాప్ వ్యాపారి మహ్మద్ వాసి ఉజ్ జమాన్ అలియాస్ ఇర్ఫాన్, మౌలాలికి చెందిన పి.రాజశేఖర్‌రెడ్డి, ఓల్డ్ సఫిల్ గూడకు చెందిన వ్యాపారి మహ్మద్ నవాజ్, మౌలాలి సాదుల్లానగర్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ సయ్యద్ మజీద్ హైదర్ ఈ నలుగురి వద్ద రాంరాజ్ రూ.57 లక్షల అప్పు అధిక వడ్డీకి తీసుకున్నాడు. అప్పు ఇచ్చిన వారు రోజూ వడ్డీ వసూలు చేసేవారు. వడ్డీ కోసం వారి వేధింపులు ఎక్కువయ్యాయి. మితిమీరిన అక్రమ వడ్డీని డిమాండ్ చేశారు. వడ్డీ చెల్లించని పరిస్థితిలో బలవంతంగా ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించుకున్నారు. ప్రామిసరీ నోట్లు, వీరికి చెందిన భూమి పత్రాలను కూడా తీసుకున్నారు. ఇంటికి వచ్చి అవమానించారు. ఇవన్నీ భరించలేక రాంరాజ్, అతని భార్య మాధవి, కుమారుడు శశాంక్ రాజ్‌లు ఫిబ్రవరి 24న ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సందర్భంగా ఒక సూసైడ్ నోట్ రాశారు. 'మా చావుకు నలుగురు కారణమని, వారు అనేక బాధలు పెట్టారని.. తీసుకున్న డబ్బు ఇవ్వాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటావని బెదిరించా రని' అందులో పేర్కొన్నారు. పోలీసులు దర్యాప్తులో కాల్ డాటా ఆధారంగా రికార్డ్స్ కూడా పరిశీలించి నిర్ధారించుకున్నారు.

నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించగా, నిందితులు అధిక వడ్డీకి డబ్బు అప్పుగా ఇచ్చినట్లు, తిరిగి చెల్లింపు కోసం వారిపై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు అంగీకరించారు. దీంతో నలుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి మరణించిన వ్యక్తి జారీ చేసిన 12 ఖాళీ చెక్కులు, 6 ఖాళీ ప్రామిసరీ నోట్లు, యాదాద్రి భువనగిరి జిల్లా, గాంధీమాల్ గ్రామంలో ఉన్న 3 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన భూమి పత్రాలు, మృతుడి కుటుంబ సభ్యులను బెదిరించడానికి నిందితులు ఉపయోగించిన మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు

